

మహాకవి

యోగేశ్వరుడు

పరిమి శ్రీరామనాథ్

© అన్ని హక్కులూ రచయితవి.

మహాకవి

యోగేశ్వరుడు

పరిమి శ్రీరామనాథ్

నా తల్లిదండ్రులు

బ్రహ్మశ్రీ పరిమి వెంకట సత్య కోటీశ్వరరావు,

పరిమి లక్ష్మీజయప్రద గార్ల

పాదపద్మాలకు.

విషయసూచిక

పురోణి	7
యోగేశ్వరప్రశస్తి	12
యోగేశ్వరుడు: ఆర్తవకవిత్వం - 1	14
యోగేశ్వరుడు: దరిద్రగృహిణి	24
యోగేశ్వరుడు: శైవకవిత్వం	28
యోగేశ్వరుడు: గ్రామకవిత్వం	46
యోగేశ్వరుడు: ఆర్తవకవిత్వం - 2	54
యోగేశ్వరుడు: కాంతారదుర్గ	61
అవశిష్టానువాదాలు	66

పురోణి

సంస్కృతకవితా గగనంలో మహాకవి యోగేశ్వరుడు ఒక మచ్చలేని పూర్ణచంద్రుడు. ఇతని కవితాజీవితమంతా విలక్షణమైనదే. చంద్రశాలలో ఏ హంసతూలికా తల్పం పైనో రమణీప్రియదూతికలూ, కర్పూరకస్తూరికాది సురభిళ వస్తువుల మధ్యలో ఆత్మకింపుగా కూర్చుని కవిత్వం వ్రాసినవారున్నారు. గర్భకోశం నకనకలాడుతుంటే, నాలుగు రాళ్లు సంపాదించవలసిన సంకల్పం హృదయంలో మండుతూ ఉంటే ఒక అధికారిని మెప్పించాలన్న లక్ష్యంతో మహాకావ్యాలు వ్రాసి పరగణాలను బహుమతులుగా పొందినవారున్నారు. భగవంతుడిపై అచంచలమైన ప్రేమతో లౌలికవాంఛలను కాలరాసి, సర్వస్వమూ తన దైవానికి అర్పించుకుని కేవల దాసబుద్ధితో మహాకావ్యాలను అల్లినవారున్నారు. కీర్తివిజయవ్యామోహంతో సభలలో ఢంకా బజాయించినవారూ ఉన్నారు. కానీ ఈ కవివరేణ్యుడు తన ఇంటినుండి బైటకు వచ్చి, తన యాత్రావర్ణననే కవిత్వం గా వ్రాసాడు. ఈ కవితలన్నీ కల్తీలేని స్వభావోక్తులు.

యశస్సూ, అర్థమూ ఇత్యాది ప్రయోజనాలను కావ్యానికి నిర్దేశించారు గానీ, వీటిని ముందు పెట్టుకుని కాకుండా జన్మాంతరసంస్కారం చేతనో, అనేక సంవత్సరాల పరిశ్రమ చేతనో హృదయాన్ని పక్వం చేసుకుని, ఆ వెలుగులో నడిచిపోయే కవి పాంచభౌతికమైన అవధుల్ని దాటిపోతాడు. అది ఒక సిద్ధదశ. ఆ దశలో కవిత్వమొక ప్రవాహమై, సహజసిద్ధంగా అతని నుండి వెలికివస్తూ ఉంటుంది. ఛందస్సు ఉందా లేదా, ఏ అర్థాలంకారాన్ని వాడాలి, శైలి ఆధునికమా, ప్రాచీనమా – ఇటువంటి కట్టడులు చదువర్లు వారి మతిని బట్టి అనుకునేవి. భౌతికంగా ఏ రంగూ రూపూ లేని ఒక అమృతానుభూతిని మనముందుకు దింపుతున్న మహాకవికి ఇవేవీ ఉండవు. తనను ఆశువుగా వ్యక్తీకరించుకోవడమే అతని పని. ఆ వ్యక్తీకరణ వెంట ఔచిత్యాలన్నీ పరుగుతీస్తాయి. వాటిని గమనించి, పోగుచేసుకోవడం మనకు ఆనందహేతువు. కర్తవ్యం కూడా.

యోగేశ్వరుడు సుమారు 9 వ శతాబ్దానికి చెందిన బెంగాల్ ప్రాంతపు కవి. ప్రకృతిపై నిబిడమైన ప్రేమా, నిశితమైన దృష్టీ కలిగినవాడు. ఇతడికి రాజాశ్రయం ఉందని కొన్ని కవితలద్వారా తెలుస్తోంది. తన రాజ్యంలోనే ఉండకుండా తన జీవితంలో భారతదేశం సుమారు తిరిగాడని ఇతడి వింధ్యావర్ణనశ్లోకాలు మనకు చెబుతాయి. దక్షిణాపథానికి కూడా ఈ కవి వచ్చి ఉంటాడు. ద్రావిడవనితను వర్ణిస్తూ చెప్పిన ఒక శ్లోకం ఉంది.

కవిత్వంలో అనేకమార్గాలు.ప్రతీమార్గమూ ఒక మహాకవి అనే జన్మస్థానం లో జనించి, చదువరుల హృదయాలలో డాగి ఉన్న రసానందాబ్ధిలో నది సముద్రంలో లయించినట్లు లయిస్తుంది. ఈ యోగేశ్వరుడు మెరుగులు దిద్దిన మార్గం అనిదంపూర్వమైనది. ఇతడు రాజప్రసాదాలను వర్ణించడు. పొలం గట్లను వర్ణిస్తాడు. పేదరాలిని వర్ణిస్తాడు. ఏమాత్రమూ చదువూ సంధ్యాలేని పామరుడి ఎదలోతులను చూపుతాడు. గ్రామదేవతను నెత్తినకెత్తుకుంటాడు. ఆ దేవతకు ఇచ్చే బలుల వెనకాల ఉన్న ఉపాసకహృదయాన్ని చూసి ముచ్చటపడతాడు. పర్వతసానువులలో తిరుగాడే పక్షులూ, జంతువులూ, గ్రామలూ, ప్రకృతీ ఋతువులూ ఈ కవికి పంచప్రాణాలు. భారతదేశపు స్వచ్ఛమైన దేశితనాన్ని నిలువెల్లా నరాలలో నింపుకున్న దేశభక్తుడు యోగేశ్వరుడు.

ఈ కవి గొప్పదనం రాచరికాన్ని వదిలి, పల్లెలవైపుకూ, పేదరికంవైపుకూ ప్రకృతివైపుకూ రావడంలో లేదు. అలా వచ్చి కూడా, సృష్టించిన తన కవిత్వం ద్వారా ఆ మార్గానికి ఎంతో విలువనిచ్చి పెంచిపోషించిన అతని శుద్ధప్రేమలో ఉంది. ఇలా గ్రామాలపైనా, ఋతువులపైనా కవిత్వం చెప్పిన మహాకవులెందరో ఉన్నారు. రామచరితమహాకావ్యాన్ని వ్రాసిన అభినందనుడు, కమలాయుధుడు, వాక్పతిరాజు, భట్టబాణుడు, మధుకంతుడు, లక్ష్మీధరుడు, వైనతేయుడు, వరాహుడు, ఉపాధ్యాయ దామరుడు, ధరణీధరుడు ఇత్యాది కవులు గ్రామకవిత్వం చెప్పినవారే. వీరిలో చాలా మంది బెంగాల్, బీహార్ ప్రాంతవాసులే. ఏ కవి వ్రాసాడో పేరు తెలియని అనామకరచితాలైన గుండెలు పిండివేసే శ్లోకాలైతే కోకొల్లలు. అయితే వారి కవిత్వసృష్టి అల్పంగానో లేదా వేరే రచనలో అంతర్భాగంగానో అయి ఉంది. కానీ యోగేశ్వరుడు గ్రామకవి. ఫక్తు భారతీయగ్రామకవి. ఇంకొక మాటలేదు.

రేవావింధ్య పులీంద్ర పామరవధూ ఝుంఝానిలప్రేషిత -
ప్రాయేఽర్థే వచనాని పల్లవయితుం జానాతి యోగేశ్వరః

అని మహాకవి అభినందనుడు యోగేశ్వరుడ్ని శ్లాఘించాడు. అభినందనుడంటే మామూలువాడు కాడు. అభినందనుడి రామచరితమ్ ఒక అద్వితీయమైన మహాకావ్యం. అభినందనుడు యోగేశ్వరుడూ సమకాలీకులని అంటారు. అతడంటున్నాడు, యోగేశ్వరుడికి తెలిసినదొక్కటే - రేవానదీ తీరాలనూ, వింధ్యసానువులనూ, పులీంద్ర పామర స్త్రీలనూ వర్ణిస్తూ ఝుంఝానిలం చేత పంపించిన మాదిరిగా మాటలను చిగురింపజేయడం!

ఈ *ఝుంఝానిలప్రేషితప్రాయే* అన్న మాటనుబట్టి యోగేశ్వరుడు ఒక దూతకావ్యాన్ని వ్రాసాడనీ, అందులో ఝుంఝానిలమే దూత అనీ H. H. Ingalls అనే పరిశోధకుడు ఊహచేసాడు. (Sanskrit poetry, from Vidyākara's Treasury,General Introduction, P.No 36). యోగేశ్వరుడి కవితలు దూతకావ్యసంప్రదాయాన్ని అనుసరించే రీతిలో ఒకే ఛందస్సులో లేవు. భిన్నభిన్నఛందస్సులలో వ్రాయబడి ఉన్నాయి. ఈ ఝుంఝానిలదూతము నాటకమై ఉండవచ్చు అన్నది మరొక ఊహ. ఈ ఊహలలో నిజానిజాలు నిర్ధారించేందుకు మనకిప్పుడు ఆధారాలేవీ లభించడం లేదు కానీ, ఒక పరిపూర్ణమైన పరిధితో యోగేశ్వరుడు చేసిన కావ్యం ఒకటి ఉంటే అది ఒక అద్భుతమై ఉండేది. ఏ కృతినీ నిర్మించకుండా తన్మయత్వంతో ముక్తకాలు గానే ఈ కవితలను యోగేశ్వరుడు పాడి ఉంటే, అది అంతకన్నా గొప్ప అద్భుతమైన సంగతి.

యోగేశ్వరుడు ఒక పదకర్మాగారం. వేదాలది ఒక సంస్కృతం. పురాణాలది మరొక సంస్కృతం. కావ్యాలది ఇంకొక సంస్కృతం. వీటిలో కూడా ఒక్కొక్క మహాకవిదీ ఒక్కొక్క రుచి. భారతీయ గ్రామాలకే ఒక సంస్కృతపు రుచి ఏదైనా ఉందంటే అది ఈ కవి భాషే. ఈ పదాలు పదవశతాబ్దపు

బెంగాలు యాస కూడా అయి ఉండవచ్చు. నేను యోగేశ్వరుడు వాడిన పదాలనూ, పదబంధాలనూ చూసి, వాటిలోని నవీనతకూ, సౌందర్యానికీ ఉలిక్కిపడ్డాను.

విద్యాకరుడి *సుభాషితరత్నకోశమూ (*ఇందులోని శ్లోకాలను "సురకో" అని చూపాను*),* శ్రీధరదాసుడి *సుదుక్తికర్ణామృతమూ (*ఇందులోని శ్లోకాలను "సదుక్తి" అని చూపాను) యోగేశ్వరుడి కవిత్వానికి ప్రధానమైన ఆకరాలు. ఈ రెండూ కూడా సంకలనకర్తల కాలానికి అందుబాటులో ఉన్న ఉత్కృష్టకవితల సంకలనాలు. E.W. Thomas తన *కవీంద్రవచనసముచ్చయం* లో పై రెండు గ్రంథాలనుండీ ఏరి, సుమారు 55 కు పైగా యోగేశ్వరుడి కవితలను జాబితాగా ఉచ్చాడు. సంస్కృతసాహిత్యంలో ధర్మయోగేశ్వరుడని మరొకకవీ, కరంజయోగేశ్వరుడని ఇంకొక కవీ ఉన్నారు. ఈ ఇరువురూ ప్రస్తుత యోగేశ్వరుడూ ఒక్కరేనని కొందరూ కాదని కొందరూ అంటారు. Ingalls తన A Sanskrit Poetry Of Village and Field: YogeŚvara and His Fellow Poets అన్న పత్రంలో యోగేశ్వరుడి కవితలను మిగిలిన కవుల గ్రామకవితలతో పాటుగా అనువాదం చేసాడు. ఆయనతో పాటు ఇంకా నాకు తెలియని మరి కొందరు పాశ్చాత్యులు ఈ మహాకవి రచనలను గురించి మాట్లాడే ఉంటారు. సంస్కృతంలోనే, సరస్వతీకంఠాభరణం ఇత్యాది సాహిత్య అలంకార గ్రంథాలలో యోగేశ్వరుడి కవితలు ఉదాహరణలుగా అనేకచోటులలో ఇవ్వబడ్డాయి.

ఇప్పటికే ఎంతో పరిశోధన జరిగిన ఈ కవితల గురించి ఒక పునారచనగా కాక, తెలుగులో వ్రాస్తూ ద్వారా నేను చేసిన పనులు, ఆ కవిత్వం నాలో కలిగించిన అనుభూతిని చెప్పడం ఒకటి. రెండవది ఆంగ్లానువాదాలను చూడకుండా నా అల్పబుద్ధికి తోచినట్లుగా భావానువాదం చేసాను. ఆంగ్లానువాదాలలో కొండొకచో నాకనిపించిన పొరపాట్లను సవరించి, తెలుగులో దిద్ది వ్రాసుకోవడం మూడవది. మొత్తం యోగేశ్వరుడి కవితలన్నింటినీ నేను పరిచయం చేసానా అన్నది ఖచ్చితంగా చెప్పలేను. ఒకవేళ ఏ కొన్నింటినో వదిలివేసినా, వ్రాసినవాటిలో పొరపాట్లు దొర్లినా సహృదయపాఠకులు నాకు తెలియపరిస్తే తప్పక సవరించుకుంటాను. నాకు H.H. Ingalls పరిశోధన గురించి చెప్పిన సహృదయులు శ్రీ పరుచూరి శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు.

ఈ చిరుపొత్తం యోగేశ్వరుడికవిత్వంలో మీకు ఏ మాత్రం లీనతను కలిగించినా నా ప్రయత్నం కృతకృత్యమైనట్లే.

శోభకృన్మహాషాఢి, వాణీచరణరేణువు,
పేకేరు. పరిమి శ్రీరామనాథ్.
03-07-2023.

యోగేశ్వర ప్రశస్తి

"నునుపుల్ పొల్పెసలారు రోకళుల మేనుంబూను హస్తాబ్జమం
దున నొండొండుగ క్రిందమీదులయి చిందుల్వోవు కేల్గాజులన్
ధ్వనితో, "హు"మ్మనువేళ కంపగతిఁ జాపల్యాత్తవక్షాన త
ప్పిన రాగమ్మున మించు, దంచునెడఁ దన్వీ గ్రామగీతావళుల్."

అనుచు దేశము దున్ని, కవనమును వెలి
దూసిన కవితావన నిత్యవాసి నీవు
నీ పదపుటసౌరభ్యపు దాపరికము
దాపురించిన మాజాతినోపవయ్య.

**   *   **

ప్రకృతినెచ్చెలి సత్యార్చి వైభవమును
కాంచని కవి విగ్రహములు కాలిపోవు
రూపక వ్యూతులందు; నీ చూపు మర్మ
విద్య మాకబ్బుటెటులోయి విమల సుకవి!

రాచనగరు కృతకపు విలాసములను
కాలరాచిన పాదాతికవివి నీవు
పల్లె దేవత హృదయాబ్జపల్లవులను
ఋక్కువించిన వైయాత్య ఋషివి నీవు
శింబితీవెకో, దారిద్ర్య సిక్తగృహిణి
కో, మహోక్షమునకో అల్లుకొన్న నీదు
యెడదనందజాలని వామనుడను నేను -
నీ ప్రశస్తిని నా మనోనిలయమందు
పత్రహరితము పంకించి వ్రాయగలను.

** * **

"నిరుపహతి స్థలంబు" లకు నెయ్యపు లంచములిచ్చి, తప్పు కో
దొరుకని వంచితాధ్వములఁ దూగ ప్రపంచములెల్ల, క్లిన్నతన్
పరచిన గుండెతో గుఱుతుపట్టిన సంస్క్రియ పొల్చి నిల్చెను
చ్చరితముగా త్వదీయ పదచాలన మెయ్యెడ సంభవించినన్.

——-----

1

యోగేశ్వరుడు: ఆర్తవకవిత్వం - 1

ఆషాఢమాసం పిలవని అతిథిలాగా మన ఇంటి ముందుకు వచ్చింది. ఈ చల్లని వర్షర్తువులో నేను ఒక కవిని తల్చుకుంటున్నాను. అతని పేరు యోగేశ్వరుడు. కాలం తొమ్మిదవ శతాబ్దం. అంటే అప్పటికి భారతదేశం కాళిదాసునీ, భారవినీ, భవభూతినీ,బాణుడినీ చూసింది. మిగతా దేశాల ఊహకు కూడా అందని విధంగా అప్పటికే ఈ దేశంలో కవిత్వమనే వస్తువు ఒక సమగ్రమైన రూపాన్ని పొందింది. అది ఈ కవి విలక్షణత్వానికి అడ్డు కాలేదు. ఈ కవి జీవితం మిగిలిన కవుల జీవితాలలాగా ఉన్నట్లు కనిపించదు. యోగేశ్వరుడు నేటి బెంగాలు ప్రాంతంలో ఉండినటువంటి పాలసామ్రాజ్యపు రాజుల ఆస్థానంలో బ్రతికిన వాడు.

పాల సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాజుల పేర్లన్నీ 'పాల' (పాలించేవాడు) అన్న మాటతో ముగుస్తాయి. వీళ్లు ప్రధానంగా బౌద్ధులు. ఆ రాజ్యంలోని వాళ్లకూ బౌద్ధమే ప్రధానమార్గం. ఈ కవి మాత్రం శివుడినీ, విష్ణువునూ పూజిస్తూ హైందవ మతానికి చెందినవాడు. కరంజయోగేశ్వరుడని ఇతడికి నామాంతరం ఉందని కొందరు. 'కరంజ' అన్న పేరుతో మహారాష్ట్రలో ఒక ప్రాంతం కనపడుతోంది. ఇతడు అక్కడ పుట్టినవాడై ఉండవచ్చు.

ఎంతో ఆదరంగా తనను సంబాళించే కవుల శబ్దలూ, అర్థాలూ అనే రత్నాలని సరస్వతీదేవి లీలగా మన రహదారుల క్రిందే దాచిపెడుతుందట. పుణ్యం చేసుకున్న కొందరికి మాత్రమే అవి దృగ్గోచరాలు అవుతాయని మహాకవి నీలకంఠదీక్షితుల మాట. శబ్దమూ అర్థములతో పాటు ఆ రత్నాలని పట్టుకున్న కవులు కూడా వస్తారు ఈ కోవలోకి. కవిత కవిలోనే పుడుతుంది. కవిలోపలే

మసలుతుంది. కవిలోపలే సమసిపోతుంది. కావ్యం కన్నా, ఆ కావ్యానికి జన్మనిచ్చిన కవిమనసు అన్నిటికన్నా విలువైన రత్నం.

వ్యక్తిగతంగా కాకుండా, ఒక కవిత ద్వారా మనకి పట్టుబడిన కవి నిరుపమానమైన నిధి. అక్షరాలలోనుండి దగ్గరైన ఒక కవి మనకి ఆప్తుడు. పక్కనే ఉండి ధైర్యం చెప్పే స్నేహితుడు. మాయ లేకుండా సంతోషాన్ని స్వచ్ఛంగా మన దోసిళ్లలో పోసే చక్రవర్తి. కవిత్వాన్ని చదువుతూ ఆ కవి దగ్గరకి, కవిత్వం చెప్పటానికి కారణభూతాలైన ఆ కవి జీవితపు లోతుల దగ్గరకి, అనుభూతులదగ్గరకి మనం వెళ్లగలిగితే, ఆ మూలాలని ఆకళింపు చేసుకోగలిగితే, అవి ఆవలింతలా మనకూ అంటుకుని, మన జీవితాలనీ పరిమళాలలో ముంచెత్తుతాయి. ఇదే కవితని మాత్రమే కాకుండా, కవి జీవితాలని కూడా చదువవలసిన అక్కర.

భారతీయకవిత్వజగత్తులో రెండు మార్గాలు కనిపిస్తాయి. ఒక కథని కవితగా అల్లుతూ సర్గలతో చేసే బృహద్రచనల మార్గం మొదటిది. ఇందులోకి రఘువంశం, కిరాతార్జునీయం, రామాయణం వంటివి వస్తాయి. దీనికి సమాంతరంగా ముక్తకాలని వ్రాయడం వేరే సంప్రదాయం. ఈ నేలమీద మనసు కదలడమే ప్రధానం కానీ, కవిత నిడివి ప్రధానం కాదు. అందుకే, ఒక కథని కవితగా అల్లుతూ కొన్ని సర్గలతో కూర్చిన రచనకి ఇచ్చిన విలువ, మనసుని కదిలించే ఒక్కొక శ్లోకానికి కూడా ఇచ్చారు. మనకి కావ్యమంటే కొన్ని పేజీల పుస్తకం కాదు. సంస్కృతంలో ఇప్పటికీ ఒక శ్లోకాన్నే కావ్యమని వ్యవహరించడం ఉంది. యోగేశ్వరుడు రెండవ మార్గానికి చెందిన కవి. ఈ కవి ఆశువుగా శ్లోకాలు చెప్పాడు. ప్రతీ శ్లోకమూ ఒక కావ్యమే అయింది.

కాళిదాసు ఉపమాలంకారాన్ని వేయడంలో ప్రసిద్ధి. భారవిది అర్థగౌరవం. భవభూతిది విశ్వవ్యాపకమైన కరుణ. అటువంటి ప్రత్యేకతకోసం ఈ కవిలో వెతికినపుడు నేను యోగేశ్వరుడికి “గ్రామకవి” అని తప్ప వేరే పేరును ఊహించలేకపోయాను.

పల్లెలంటే ఈ కవికి ప్రాణం. వాటిలో తాను తిరిగిన మార్గాలనీ, చూసిన ప్రకృతినీ కవితలుగా వ్రాసాడు. వింధ్యపర్వతాలనీ, రేవానదినీ, బోయవాళ్లనీ, పల్లెపడుచులనీ, ఝుంఝూమారుతాలనీ వర్ణన చేసాడు. ఎక్కువశాతం ఏ ఆర్భాటమూ లేని ఈతని కవిత్వం మామూలుది. మామూలుగా చేతికి వచ్చేది. అందుచేతనే తీయనైనది. ఎక్కడా దొరకనిది. ఈ కవితల రుచి చూసిన తరువాతి కవులు యోగేశ్వరుడిని మెచ్చుకోకుండా ఉండలేకపోయేరు. మహాకవుల జాబితాలో తరువాత చేరిన అభినందనుడనే కవి యోగేశ్వరుడిని సరిగా పోల్చుకున్నాడు. గ్రామసంబంధకవిత్వంతో మాటలని ఎలా పల్లవింపచేయాలో తెలిసినవాడట ఈ కవి. అభినందనకవి పలుకులు అక్షరసత్యాలు.

యోగేశ్వరుడు చెప్పిన కవిత్వంలోనే నేను కొన్ని రోజులుగా మునకలు వేస్తున్నాను. ఈ కవి ఋతువులని వర్ణించడంలో చేయి తిరిగినవాడు. వీటిలో ఊహలకన్నా, నన్ను ఆకట్టుకున్న అంశం సహజత్వం. తాను ప్రకృతి దగ్గరకి నడుచుకుంటూ వెళతాడు. ప్రకృతిని చూస్తాడు. చూస్తున్నాను అంటూ శ్లోకం చెబుతాడు. అదే ఉత్కృష్టమైన కవిత అవుతుంది. బరువుతో కూడిన సహజత్వం. ఆ అందం ఒక్కోసారి మనం మామూలుగా చూసే ఉత్ప్రేక్షలనీ, రూపకాలనీ అతిశయించి ఉంటుంది.

ఇవాళ వర్షాకాలం మీద యోగేశ్వరుడు చెప్పిన కొన్ని కవితలని పంచుకుంటున్నాను.

1

సురకో 264
స్రగ్ధర

కామం కూలే నదీనామనుగిరి మహిషీయూథనీలోపకంఠే
గాహంతే శష్పరాజీరభినవ శలభగ్రాసలోలా బలాకాః।
అంతర్వ్యన్యస్తవీరుత్తృణమయ పురుష త్రాస విఘ్నం కథంచిత్
కాపోతం కోద్రవాణాం కవలయతి కణాన్ క్షేత్రకోణైక దేశే॥

నది ఒడ్డున పర్వతసానువులలో గేదెల గుంపులున్న చోటులో
కొక్కెర పక్షులు మిడతపిల్లలకోసం గడ్డిపరకలని గాలిస్తున్నాయి.
మధ్యలో ఉంచిన భయంకరాకృతియైన గడ్డిబొమ్మ ఉన్నా కూడా
యేదో విధంగా చేను మూలలో పావురాల గుంపు ఆళ్లగింజలని ఆరగిస్తోంది.

~

పొలాలలో దిష్టిబొమ్మలని ఉంచడం ఆనాటి నుండి వస్తున్నదన్నమాట! దానికి ఈ కవి పెట్టిన పేరు తృణమయపురుషుడు! ఈ కవితలో ప్రత్యేకత ముందు చెప్పినట్లుగా అర్థాలంకారం ఏమీలేదు. యే ఊహా లేని సహజత్వం. భావంలో అదే గౌరవాన్ని తీసుకువచ్చింది. ఇది కవి ప్రత్యక్షంగా అనుభవించిన సన్నివేశం. తన యెదురుగా ప్రకృతిలో కనిపిస్తున్న అందాన్ని కెమేరా బదులుగా తన కవిత్వమేధతోటి మొత్తంగా ఒడిసిపట్టాడీ కవివరేణ్యుడు. అదే అతనికి సమాధి అయింది. సమాధిని ఉన్నది ఉన్నట్లు చెప్పడానికే ప్రయత్నముంటుంది.

కాపోతమంటే కపోతాల గుంపు. కవలయతి - ఇది చాలా మంచి క్రియాపదం. కబళించు అన్న అర్థంలో. ఈ కవలమే కవళము -> కబళము అన్న పదాలకి దారినిచ్చి ఉండవచ్చు.

కథంచిత్ - ఏదో ఒక విధంగా. యెదురుగా బెదురుగొలిపే దిష్టిబొమ్మ ఉన్నా పావురాల గుంపు భయాన్ని పొందడం లేదు.

మహిషీయూథనీలోపకంఠం - చాలా మనోజ్ఞమైన అల్లిక. ఉపకంఠమంటే దాపు. అనుగిరి - ఎంత మంచి మాట ఇది! గిరిని అనుసరిస్తూ అని.

2

సురకో 221
శార్దూలవిక్రీడితం

దాత్యూహధ్వనిభాంజి వేతసశిఖాసుప్తోరగాణి ధ్వనత్
కాదంబాని కురంగయూథకలితస్తూపాన్యుదంభాంసి చ ।
తీరాణ్యద్య పిపీలికాసముదయావర్జజ్జటాలోలుప
వ్యాప్తాన్యున్మదకుక్కుభాని సరితాం కుర్వంతి లోలం మనః॥

చాతకపక్షుల ధ్వనులతోటి,
ప్రబ్బలచెట్ల కొమ్మలని చుట్టుకుని నిద్రిస్తున్న సర్పాలతోటి,
చప్పుడు చేస్తున్న కదంబవృక్షాలతోటి,
జింకలగుంపులు తిరుగాడుతున్న మట్టిదిబ్బలతోటి,
జడలు జడలుగా ఆకారాలు సృష్టించిన
చీమల సముదాయాలమీద ఆసక్తి కలిగిన అడవి కోళ్లతోటి
వర్షాకాలపు నదులు మనసుని విచలితం గావిస్తున్నాయి.

~

ఈ పద్యంలో నన్ను ఆకట్టుకున్న పదం - అద్య. నేడు అని. అంటే, ఈ వర్ణన కవి ఊహ కాదు. వర్షంతోటి నిండుకున్న నది చుట్టూ చుట్టాలలాగా చేరిన జంతుజాలం, అక్కడే ఉన్న వృక్షజాతుల మధ్యలోకి ఈయన వెళ్లాడు. వాటిని చూసాడు. ఆ అందానికే ముగ్ధుడైయాడు. ఆశువుగా కవితని చెప్పాడు. వర్షాకాలపు నదులని వర్ణించడానికి ఊహలు చేయడం రానివాడా ఈ కవిపుంగవుడు? కాదు కాదు, అవి చేయకుండానే ప్రకృతి స్వభావానికే వశమై అమితానందాన్ని పొందే సౌందర్యపిపాసి.

ఇది ఎన్ని జన్మల పుణ్యమో ఫలిస్తేనే కానీ కుదురుకోని మనఃస్థితి. కుర్వంతి లోలం మనః - అందమైన పదబంధం.

3
సురకో 220
శార్దూలవిక్రీడితం

ఆసారాంత మృదు ప్రవృత్తమరుతో మేఘోపలిప్తాంబరా
విద్యుత్పాతముహూర్త దృష్ట కకుభః సుప్తేందుతారాగ్రహాః ।
ధారా క్లిన్న కదంబ సంభృత సురా మోదోద్వహాః ప్రోషితైః
నిస్సంపాత విసారి దర్దుర రవా నీతాః కథం రాత్రయః ॥

జడివాన ముగిసాక, మారుతమొకటి మృదువుగా ప్రవర్తిల్లింది.
ఆకాశం మేఘాలతోటి పులుమబడి ఉంది.
విద్యుత్పాతం చేత ముహూర్తకాలం చూడబడిన దిక్కులు,
నిదురపోయిన చందురుడు, తారకలు, గ్రహాలు.
నేలమీద తడిచిన కదంబవృక్షాలనుండి ఒక సురభిళగంధం పైకి లేస్తున్నది.
అర్ధరాత్రంతా ప్రసరిస్తున్న కప్పల బెకబెకలు.
ప్రేయసిని వదిలి దేశాంతరం వెళ్లిన ప్రియులు ఈ రాత్రులని యెలా గడిపి ఉంటారో?

~

ఈ కవిత నిజానికి విరహవిషయసంబంధమైనది. కానీ, ప్రాకృతికసౌందర్యసహజత్వప్రేమమనే ఈ కవి యొక్క విలక్షణలక్షణంలో మునిగి కొత్తరూపుతో పైకి వచ్చింది. వర్షాకాలంలో కప్పుల బెకబెకలని కూడా చూసిన కవి బహుశా ఇతడేనేమో. అంతే కాదు, వర్షాకాలంలో కడిమిచెట్లనుండి వచ్చే వాసన ఈతని హృదయంలో ముద్రించుకుని పోయింది.

మిగిలిన కవితలలానే ఈ కవిత లోతు తెలియాలంటే, వర్షపాతం తరువాత ప్రకృతిని దగ్గరగా చూసి ఉండాలి. ఆ ఆందం అపుడే మనసులోకి వస్తుంది. ఈ కవితలో ప్రతీ వాక్యపు బరువూ మనం మోయలేని అనుభూతే.

ఆసారము - జడివాన. మంచిపదం. భవభూతి రాత్రిరేవ వ్యరంసీత్ అన్నాడు. యోగేశ్వరుడు నీతాః కథం రాత్రయః అన్నాడు - అంతే గాఢతతో.

4
సురకో 250
శార్దూలవిక్రీడితం

మేఘశ్యామదిశి ప్రవృత్తధనుషి క్రీడత్తటిత్తేజసి
ఛన్నాహర్నిశి గర్జితప్రమనసి ప్రమ్లానలీలారుషి
పూర్ణశ్రోతసి శాంతచాతకతృషి వ్యాముగ్ధచంద్రత్విషి
ప్రాణాన్ పాంథ కథం దధాసి నివసన్నేతాదృశి ప్రావృషి.

మేఘాలచేత నల్లబడిన దిక్కులూ,
ఉద్భవించిన శక్రచాపం,
ఆటలాడుతున్న తటిత్తుల తేజస్సు,
ఆచ్ఛాదితాలైన రేబవళ్లూ
గర్జిస్తున్న సాధుహృదయాలూ
వాడిపోయిన మిథ్యాక్రోధాలూ
నిండిపోయిన నదులూ,
శమించిత చాతకాల తృష్ణా,
విరగబూసిన వెన్నెలలూ –
ఓ పాంథుడా!

ఇంతటి మనోరమమైన వర్షాకాలంలో
ప్రాణాలనెట్లా నిలుపుకోగలుగుతున్నావు?

~

విద్యాకరుడు ఈ కవిత యోగేశ్వరుడి కవిత కాదేమో అని అనుమానపడ్డాడు. ఆయనదైనా కాకున్నా, అద్వితీయశబ్దసౌందర్యాన్ని మూటగట్టుకున్న కవిత ఇది. దీనిని చదివినప్పుడు నాకు కృష్ణకర్ణామృతంలో ఈ మధురశ్లోకం గుర్తు వచ్చింది, ముఖ్యంగా నాలుగవ పాదం –

యజ్ఞైరీజిమహే ధనం దదిమహే పాత్రేషు నూనం వయం
వృద్ధాన్ భేజిమహే తపశ్చకృమహే జన్మాంతరే దుశ్చరమ్
యేనాస్మాకమభూదనన్య సులభా భక్తిర్భవద్వేషిణీ
చాణూరద్విషి భక్తకల్పమముషి శ్రేయఃపుషి శ్రీజుషి.

~

5
సురకో 254
శార్దూలవిక్రీడితం

ఏతాః పంకిలకూలరూఢన దల స్తంబక్వణత్ కంబవః
క్రీడత్కర్కట చక్రవాల విదలజ్జంబాల తోయావిలాః ।
హృల్లేఖం జనయంత్యనూపసరితాముత్తుండ గండూపదో -
త్కీర్ణక్లిన్న మృదో నదస్థపుటితప్రాంతాస్తటీ భూమయః ॥

బురదగట్లమీద మొలిచిన రెల్లు పొదలలో నిలబడి ఘీంకరిస్తున్న ఏనుగులు,
ఆడుతున్నటువంటి పీతల గుంపుల చేత చెదురుమదురవుతున్న బురదనీళ్లు
ముఖభాగంతోటి వానపాముల చేత పైకి తొలచబడిన తడిమట్టి;
ఈ అందాలతోటి నదీప్రాంతాలు నా గుండె మీద ముద్రని వేస్తున్నాయి.

పీతలు, వానపాములని దగ్గరగా భారతీయకవి తొమ్మిదవ శతాబ్దంలోనే పరికించాడు. ఈ వర్ణనలో యెంత శుద్ధత్వం! ఆ కవి మనసు ప్రకృతిని చూసి ఎంత పరవశించి ఉండకపోతే, 'హ్లాల్లేఖం జనయంతి' అన్న పదాన్ని వేయగలుగుతాడు! వానపాము తొలుస్తున్న బంకమన్ను, పీతలు కత్తిరిస్తున్న తడిమట్టి - వీటిని ఇంత సౌందర్యవంతంగా చూసిన మొదటి హృదయం యోగేశ్వరుడిదేనేమో.

6

సురకో 257
ఆర్య

పిబతి వ్యోమకటాహే సంసక్తచలత్తడిల్లతా రసనః।
మేఘమహామార్జారః సంప్రతి చంద్రాతపః క్షీరమ్॥

ఇప్పుడు ఆకాశమనే కడవలో
చేరి కదులుతున్న విద్యుల్లత అనే నాలికతో
వెన్నెల అనే పాలని
మేఘమనే పెద్దపిల్లి త్రాగుతోంది.

~

స్వభావోక్తిలో తనకున్న ప్రతిభని చూపిన వెంటనే ఎవరూ చేయని ఊహని మనముందుకి తీసుకువచ్చాడు ఈ కవి. రాత్రిపూట ఆకశంలో మెరుపుని చూసిన కవిహృదయం పొందిన పొంగు ఫలమే ఈ శ్లోకరత్నం. నేను యెంత వ్రాసినా, ప్రకృతి దృశ్యాన్ని ముందు పెట్టలేను. ఆ దృశ్యాన్ని చూసిన మనసు కనుక ఉంటే ఈ కవితలని చదవగానే అప్రయత్నంగా ఉప్పొంగుతుంది. అది మాత్రం చెప్పగలను.

7
సురకో 258
ఆర్య

అర్ధోద్గతేన కదలీ మృదుతామ్రతలేన గర్భకోశేన
పిబతి నిదాఘజ్వరితా ఘనధారాం కరపుటేనైవ

సగం ఎదిగిన లేతయెరుపు రంగులో ఉన్న గర్భకోశం తోటి

యెండకి యెండిపోయిన అరటిచెట్టు నీటిని దోసిళ్ళ పట్టినట్లు త్రాగుతోంది.

8
సురకో 263
స్రగ్ధర

తావద్వాచః ప్రయుక్తాః మనసి వినిహితా జీవదాశాపి తావత్
విక్షిప్తా తావదంఘ్రీ పథి పథికజనైర్లంభితా తావదాశా ।
పుల్లద్ధారాకదంబ స్తబక వలయితా యావదేతే న దృష్టా
నిర్ముక్త వ్యాళ నీల ద్యుతినవ జలదవ్యాకులా వింధ్యపాదాః॥

మాటలు మాట్లాడడమంతవరకే.
మనసులో బ్రతుకుమీద ఆశా ఆంతవరకే.
అడుగులు పడేది అంతవరకే.
పథికులకి దిక్కు తోచేదీ అంతవరకే.
ఎపుడైతే కడిమిచెట్లతో చుట్టుకోబడి,
కుబుసం విడిచిన పాము నలుపు వంటి నల్లనైన మేఘాలతో
వ్యాకులపడిన వింధ్య ప్రాంతపు కొండదరులని చూస్తారో,
అపుడిక అవన్నీ ముగిసినట్లే.

~

యోగేశ్వరుడు వింధ్యసానువులలో ఊపిరి తీసుకున్నాడు. ఆ ప్రాంతమంటే ప్రాణసమానం ఇతడికి. అభినందన కవి పొగిడినట్లుగా, తొమ్మిదవ శతాబ్దపు వింధ్యపర్వత ప్రాంతాన్ని చూడాలంటే ఈ కవి కన్నులు అరువుకి తెచ్చుకోవాలి. బెంగాలు వైపుగా వెళుతూ వింధ్యపర్వతాలలో కొంతకాలం ఈ మహనీయుడు గడిపి ఉంటాడు. అక్కడే ఈ ప్రాంతంతో ప్రేమలో పడి ఉంటాడు.

*

2

యోగేశ్వరుడు: దరిద్రగృహిణి

సురకో 1312

శార్దూలవిక్రీడితం

గృహిణి భారతీయ కవితలో అతిపురాతనమైన కవితావస్తువులలో ఒకటి. తన ప్రవర్తన చేత మాత్రమే కవులకి కవిత్వాన్ని నేర్పింది. కుటుంబకాంతకి దొరికే గౌరవం, ఆ ధర్మానికి ఉన్న విలువా చాలా గొప్పవి. పేదరికం ఒక ఆరని కుంపటి. ఆ తాపంలో కొద్దికొద్దిగా దగ్ధమయ్యే ఇల్లాలు కవిత్వదృష్ట్యా ఒక అపురూపమైన సంగమం. ఆమె మనసులోని యెత్తుపల్లాలు గుండెని పిండివేస్తాయి. కుసుమపేశలహృదయుడైన యోగేశ్వరుడు తన జీవితంలో అటువంటి ఇల్లాలిని చూసి చలించకుండా ఉండలేకపోయేడు. ఈ కవితకూడా ఒక రకంగా యోగేశ్వరుడి వర్షర్తుకవిత్వం క్రిందికే వస్తుంది.

**

చివికిపోయిన చేటముక్కను శిరసు మీద ధరించి
నానిపోతున్న బార్లీ గింజల గురించి చింతిల్లుతోంది.
రోదిస్తున్న పిల్లలని అనునయిస్తోంది;
చిల్లు చెంబుతో లోపలకి చేరిన నీటిని అవతలికి పారబోస్తోంది;
గడ్డిపరుపుని కాపాడుకుంటోంది.
ఇంద్రుడు యెడతెరిపి లేకుండా వర్షిస్తున్నపుడు
వ్యాకులపడుతున్న మరమ్మత్తుల ఇంటి పేదరాలు
చేయని పని ఏముంది?

శ్లో.

సక్తూన్ శోచతి సంప్లుతాన్ ప్రతికరోత్యాక్రందతో బాలకాన్
ప్రత్యుత్సించతి కర్పరేణ సలిలం శయ్యాతృణం రక్షతి।
దత్వా మూర్ధని శీర్ణశూర్పశకలం జీర్ణే గృహే వ్యాకులా
కిం తద్యన్న కరోతి దుఃస్థగృహిణీ దేవే భృశం వర్షతి॥
**

ఒక పేదరాలి పైని కవిత ఇది. ఆకాశానికి చిల్లులుపడినట్లు పడుతున్న వానలో ఒక జీర్ణగృహంలో ఒక తల్లి పడుతున్న పాట్లు ఈ కవిత వరుసలో పెడుతున్నట్లున్నా అంతర్లీనంగా ఎన్నో భావాలు ఈ కవితలో గోచరిస్తాయి.ఈ కవితలో యోగేశ్వరుడి ముద్ర అయిన వర్తమాన కాలాన్నే క్రియాపదాలు సూచిస్తున్నాయి. యోగేశ్వరుడి ప్రత్యేకతైన గ్రామీణనేపథ్యంతో పాటు, Painting a picture through words ని కూడా ఈ కవితలో చూడవచ్చు. అంతే కాదు, ఈ కవితలో ఒక్కొక పదం చెప్పని అంశాలని చెబుతుంది. ఇందులో గృహిణి వ్యాకుల. స్థిమితం లేని పరిస్థితిలో చిల్లులుపడి వాన ధారలు ఇంట్లోకి పడుతున్న ఒక గుడిసెలో బ్రతుకుతోంది. ఆ ఇంటికి రాగల అతిపెద్ద ఇబ్బంది కుంభవృష్టి. అది వచ్చినపుడు ఆమె మనఃస్థితి, ప్రవర్తనా ఈ కవితలోని వస్తువు. ఇటువంటి ఒక కవితని గాథాసప్తశతిలో చూడవచ్చు.

पहिअवहू विवरन्तरगलिअजलोल्लि घरे अणोल्लं पि।
उद्देसं अविरावाहसलिलणिवहेण उल्लेइ॥ (6-40)

మెందుకొని మిద్దెబంగలనుండి కురియు
వాననీటులc దోcగిన ప్రాcతయింట
నానకుండిన చోటును నాన్పుచున్న
దకట! కన్నీళ్ళc బాంధునిల్లాలు చూడు.

(శాలివాహన గాథాసప్తశతీసారము, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ)

ఈ గాథలో ఇల్లాలి భర్త ఇంట్లో లేదు. ఆ విరహంతో నీళ్లు కారుతున్న ఇంట్లో తడవని చోటులో కూర్చుని తన కన్నీటితో ఆ చోటుని సైతం తడుపుతోందట. ప్రస్తుత కవితలోని పేదరాలి స్థితి అంతకంటే దయనీయమైనది. ఆమెకు తన పేదరికాన్నో, ఇంట్లో లేని భర్తనో తల్చుకుని తీరికగా దుఃఖించే అవకాశం లేదు. ఆమెకు చేయవలసిన పనులున్నాయి. ఆమె అటూ ఇటూ పరిగెడుతోంది. కంగారుపడుతోంది.

ఇంట్లో ధారలు పడి నీళ్లు లోపలికి వస్తున్నాయి. పిల్లలేడుస్తున్నారు. మంచం తడిసిపోతోంది. పుండు మీద కారం చలినట్లు ఈ అంశాలు నిజానికి దుఃఖాన్ని పదింతలు చేసేవి. కానీ ఆ ఆడుది తలవంచేది కాదు. ధైర్యవంతురాలు. తన బాధ్యత నుంచి తప్పించుకునే బుద్ధి ఉన్న స్త్రీ కాదు.

**

సంప్లుతాన్ సక్తూన్ శోచతి - నానిపోతున్న బార్లీగింజలు (యవలు) ని గురించి ఆలోచిస్తోంది (శోచతి). ఆలోచన దేనికి? ఆమెకు వాటిని యెత్తి లోపలకి తెచ్చుకునే అవకాశం లేదు. ఇల్లు నీటితో నిండిపోతూంది. పిల్లలున్నారు. ముందు వాటిని సవరించాలి. అలాగని వదిలివేయనూలేదు. పేదరికం. ఇది హృదయవిదారకమైన వర్ణన. సప్తశతిలో ఇలాగే చూరునుండి పడుతున్న వాననీటిని తన శిరసుతో అడ్డుపెట్టి కొడుకుని కాపాడుతున్న ఒక తల్లి తన కన్నీటిధారలతో కొడుకు తడవడం గమనించడం లేదట.

रक्खेइ पुत्तअं अत्थएण ओच्छोअअं पडिच्छन्ती।
अंसुहिं पहिअधरिणी ओल्लिज्जन्तं ण लक्खेइ॥ (7-21)

చూరునుండి వాననీరు గాఁగc దల
నడ్డువెట్టి కొడుకు నాదుకొనెడుc
గాని, పాంథగృహిణి, కన్నీటివరదలc
దాను దడుపుచుంట కానదకట. (రాళ్లపల్లి వారు)

ప్రతికరోత్యాక్రందతో బాలకాన్ - ఏడుస్తున్న బాలకులని ఓదారుస్తోంది. ఏడుపుకి కారణమేమిటి అని ఆలోచిస్తే వర్షం, చుట్టూ నీళ్లు, చికాకుతనం, పేదరికం ఇవన్నీ పిల్లలు సాధారణంగా వర్షంలో పడే ఆనందాన్నీ ఉత్సాహాన్నీ వాళ్లకి లేవు అని చెబుతున్నాయి. ప్రతికరోతి చాలా మంచి క్రియాపదం. ప్రతిగా చేయడమని. అవసరమైనట్లుగా తగ్గవిధంగా ఓదార్చడమని.

ప్రత్యుత్సించతి కర్పరేణ సలిలం-చిల్లుపడిన పాత్రతో నీటిని బైటికి తోడుతోంది. *ప్రత్యుత్సించతి* - ఇది కూడా అరుదైన పదం. సేచనమంటే తడపడం, చల్లటం. ప్రతి - వ్యతిరేకంగా; ఉత్ - పైకి; సేచనమన్నమాట.
దత్వా మూర్ధని శీర్ణశూర్పశకలం - "శిరసు పైకి చెడిపోయిన చేట యొక్క శకలాన్ని ఇచ్చుకొని" అని మక్కీకి మక్కీ అనువాదం. ఈ సమాసం ఈ కవితకి ఆయువుపట్టు. ఆ ఇల్లాలి మనోస్థైర్యాన్ని మన ముందు పెట్టేది. ఆమె పైని పనులు చేస్తూ తడిచిపోతూంది. రక్షణ కావాలి. ఇంట్లో గొడుగు ఉండే పరిస్థితిలేదు. ఒక చేట కూడా పూర్తిది లేదట. ఒక శకలమేదో ఉంటే అదే శిరసుమీదకెత్తికొంది. ఇక్కడ ఉంచింది, పెట్టుకుంది,ధరించింది ఇలాంటి పదాలు కాక, 'దత్వా'(ఇచ్చింది) అన్నాడు కవి. ఎంత బరువైన ప్రయోగమిది! ఆమెకు ఆమే ఇచ్చికొన్న ఒక కానుక అది. ఆమె నిబ్బరానికి సంకేతం అది.

దేవే భృశం వర్షతి - దేవుడు బాగా వర్షిస్తున్నపుడు. దేవ శబ్దం ఇంద్రుడికి లేదా వరుణుడికి ఇక్కడ వర్తింపచేయవచ్చు. సంస్కృతకవితలలో వర్షాన్ని విరహం వల్లనో లేదా దేనివల్లనో కర్కశంగా లేదా నిందిస్తున్నట్లుగా కవితలున్నాయి. (మేఘైర్వ్యోమ నవాంబుభిర్వసుమతీ - విజ్జిక). ఈ కవితలో కవి వర్షాన్ని నిందించలేదు. కవి చూపు కుండపోతమీద లేదు. నిబ్బరపుపోత అయిన ఆ ఇల్లాలిమీద ఉంది. ఆమె తత్తరపాటులో ఒక ప్రసన్నత కవికి కనిపించింది. సమర్థత తేటతెల్లమయింది. అందుకే 'అహో, బత' లాంటి జాలి మాటలని వాడకుండా 'కిం తద్యన్నకరోతి' అని ప్రశ్నించి సమాధానాన్ని రూఢిచేసాడు.

**

ఇల్లాలు ఒకప్పుడు ఆసేతుహిమాచలమంతటి ఈ దేశాన్ని తన చీరకొంగు క్రింద పొదివికొంది. మానవుడికి అత్యంతసమీపవస్తువులైన కుటుంబము, ఇల్లు - ఈ రెండింటినీ తనలో కలిపేసుకుంది. ఆమె కనబరిచిన సమర్థత భాషలో పదాలనే పుట్టించింది. గృహిణి - ఇంటికి యజమానురాలు; కుటుంబిని - కుటుంబం కలది; పురంధ్రి - తనవాళ్లు ఉన్న పురాన్ని ధరించేది. ఈ పేళ్లు భాషాదేవి ఇల్లాలికిచ్చిన బిరుదులు.

గృహిణి చేసే కర్మని బ్రతుకుతున్న భర్త రూపేణా, ఎదుగుతున్న పిల్లలరూపేణా, చక్కబడుతున్న ఇల్లు రూపేణా ప్రకృతి లెక్కిస్తూనే ఉంటుంది.

**

3

యోగేశ్వరుడి శైవకవిత్వం

మహాకవి యోగేశ్వరుడు అనేక విలక్షణత్వాలని తన కవిత్వం ద్వారా ప్రదర్శించాడు. ఇది ఎవరికో గానీ సాధ్యమవని అంశం. చెప్పినవి వేళ్ల మీద లెక్కించగలిగే శ్లోకాలైనా ప్రతీ కవితా ఒక కొత్త పుంత త్రొక్కింది. అందమైన కవితాసాంప్రదాయాలనే మొక్కలని నాటి మనసారా నీళ్లు పోసిన తోటమాలి ఈ కవి. ఆ మొక్కలు నేడు నిర్జరమందారాలై సుగంధాలని వెదజల్లుతున్నాయి.

యోగేశ్వరుడి కవిత్వానికి ముఖాలు ప్రధానంగా మూడు. ఒకటి ఋతుకవిత్వం (ఇందులో వర్షర్తుశ్లోకాలని మటుకు ఇదివరకు పరిచయం చేసాను, ఇది సశేషం), రెండు గ్రామకవిత్వం(దీనిమీదా తొందరలో). మూడవది భగవత్కవిత్వం. యోగేశ్వరుడు గ్రామీణభారతానికి తన సగం

ప్రాణాలని అప్పజెబితే, మిగతా సగం శివుడికి ధారవోశాడని అనిపిస్తుంది. విష్ణువు మీదా, కృష్ణుడి మీదా యోగేశ్వరుడు కవిత్వం చెప్పాడు కానీ ఒకటో రెండో మాత్రమే శ్లోకాలు నేడు లభ్యాలు.

కవిత్వమొక పాశం. సామర్థ్యమున్న వ్యక్తి చేతినుండి విసరబడినపుడు ఏ దివ్యలోకాలలోని వస్తువునైనా పట్టి లాగగలదు. కవి సత్వగుణప్రధానసంస్కారి. ఋషికల్పుడు ("నానృషిః కురుతే కావ్యమ్"), చూచేవాడు ("రవి కననిది కవి యెరుగును, కవియెరుగని చోటు రవియు గానదు" - వేమన). ఇది అంతస్సామర్థ్యం. వీటితో సమానంగా కవి కూర్పరి ("కవిః శ్లోకతే"- శ్లోకనమంటే కూర్పు). ఇది బహిస్సామర్థ్యం. ఈ సామర్థ్యానికి ఛందస్సూ, రసాలంకారాలూ, ఔచిత్యమూ ఇత్యాదులు ప్రాణాలు. కూర్పులో ఛందస్సు పైపొర. రసాలంకారాలు మొదలైనవి దానిలోపలిది. ఔచిత్యం ఈ రెండింటిలోనూ సమానంగా వ్యాపించి ప్రవహించే అంతర్వాహిని.

కాశ్మీరదేశమహాకవి క్షేమేంద్రుడు తన *ఔచిత్యవిచారచర్చ* అనే గ్రంథంలో ఔచిత్యంమీద విస్తారమైన చర్చ చేసాడు. ఉచితస్య భావమ్ ఔచిత్యమ్ అని. ఉచితమన్న పదం నుండి ఔచిత్యమన్న లక్షణం పుట్టింది. క్షేమేంద్రుడు ఏది దేనికి తగినదై ఉంటుందో, అది దానికి ఉచితమని అన్నాడు. ఒక జీవిలో నాడులు, గ్రంధులు మొదలైన మర్మాలలో జీవం వ్యాపించి ఉన్నట్లుగా, కావ్యాన్ని ప్రతీ పదంతో మొదలుకొని, రసం వరకూ, పాకం వరకూ, శయ్యవరకూ ఔచిత్యం వ్యాపించి ఉంటుంది. ("పదప్రభృతిషు స్థానేషు మర్మస్వివ కావ్యస్య సకలశరీరవ్యాపి జీవితమౌచిత్యం స్ఫుటత్వేన స్ఫురదవభాసతే"). ఔచిత్యమే కావ్యానికి 'జీవితం' అని క్షేమేంద్రుడు చేసిన సిద్ధాంతం భారతీయవాఙ్మయజగత్తులో దాని ప్రాధాన్యతని మన ముందుంచుతుంది.
దేనికి ఏది తగినదో చెప్పేదెవరు అని ప్రశ్న. సహృదయుడి హృదయమే అని సమాధానం. రామాయణంలోని సుందరకాండలో హనుమంతుడు సీతాన్వేషణకోసం బయలుదేరినపుడు ఆయన సమాయత్తమవడం, మహిమాప్రదర్శన, చేసిన ప్రయాణం ఇదంతా సుదీర్ఘంగా వర్ణించబడింది. వచ్చేటప్పుడూ ఆయన అదేవిధంగా నూరు యోజనాలు దాటేడు. కానీ ఆ వర్ణన ఉండదు. ఉండటం ఉచితం కాదు కనుక. సీతాదర్శనవార్తను కనులలో ఒత్తులు వేసుకుని యెదురుచూస్తున్న

వానరులకు యెరింగించడమే హనుమంతుడు చేయదగిన పని. అల్లంత దూరానే కొన్ని సైగలద్వారా, గర్జనల ద్వారా తన విజయాన్ని తెలియపరుస్తాడు హనుమ. ఆ వర్ణనే అక్కడ తగినది.

ఔచిత్యం కావ్యానికే కాదు, కవితాజగత్తులో ఉన్న సంప్రదాయాలకూ వర్తిస్తుంది. అప్పుడే అది జీవించగలుగుతుంది. ఔచిత్యమున్న సంప్రదాయాన్ని ఏర్పరచగలగడం ఒక్క మహాకవి వల్లనే జరుగుతుంది. నిజానికి సాహిత్యంలో, కావ్య రచనలో భాగంగా ఏదో ఒక క్రొత్తదనాన్ని తీసుకునిరావడం తేలిక. సంప్రదాయాన్ని ఏర్పరచడం కష్టం. సంప్రదాయం ఏర్పడేటప్పుడు దాని స్రష్టకూ ఆ ఆలోచన ఉండకపోవచ్చు. స్రష్ట తన సంస్కారాన్ని బట్టి రచన చేస్తాడు. ఔచిత్యం అన్న వస్తువులోని ఇంకొక ప్రత్యేకత, ఇది మాటలలో కన్నా, అనుభూతిరూపంగా మౌనంలోనే మెల్లిగా ప్రసరిస్తుంది. ఒక రచనని చదివినపుడు ఆ అమరిక చదువరి మనసుకి అనుభూతికి వచ్చి ఒక తెలియని ముద్ర వేస్తుంది. ఆ ముద్రబిళ్ల తాకగానే ఆ కావ్యఫణితి సహజంగానే అనుకరణీయమవుతుంది. ఔచిత్యం పరిమితమైన వస్తువు కాదు. దేశకాలపరిస్థితులని బట్టి ఔచిత్యరీతులు ఆయా తరాలలో సహజంగానే వెలికివస్తూ ఉంటాయి. సాహిత్యం నిత్యయవ్వనం కావటానికి ఇదొక ప్రధాన కారణం.

యోగేశ్వరుడి శివకవిత్వం కేవలం అర్థగుణాలతోనూ, రూపగుణాలతోనూ కూడుకున్నది మాత్రమే కాదు, అది ఒక సంప్రదాయం. ఒక పద్ధతి. భగవత్స్తుతి సాహిత్యంలో ఇతడు బలపరచిన కవితాముఖం అంతకు ముందెవరూ ఇంతలా చూడనిది. అది కేవలం కవులకి కుదిరే చేష్టకాదు. అపారమైన శివభక్తితో పాటుగా, మేధాసంపత్తీ, శాస్త్రపారీణత ఉన్న వారు మాత్రమే చేయగలిగింది. ఊహ, రచనాసంవిధానం, శబ్దార్థాలంకారాలూ వంటి కవితాగుణాలతోపాటుగా, ఔచిత్యాన్ని వీటికి మించిన పాళ్లలోనే కలిగి ఉన్న ఈ పూలబాటని ఎంతో శ్రద్ధతో యోగేశ్వరుడు ఏర్పరిచాడని తల్చుకున్న ప్రతిసారీ నా మనసు పొంగులువారుతుంది. ఈ కవితామార్గంలో యోగేశ్వరుడి తరువాత కవులతో పాటుగా, తొలితరం తెలుగు కవులదగ్గర నుండీ, నేటి అవధానులవరకూ పయనిస్తుండడం ఈ మార్గం యొక్క మహత్త్వానికి తార్కాణమని నేను చెప్పనవసరం లేదనుకుంటాను.

ఈ ఊహలు అనన్యసామాన్యాలు. అనిదంపూర్వాలు.

1
శివ(వా)తాండవబోధ
సురకో 60
శార్దూలవిక్రీడితం

శ్లో.

ఏవం స్థాపయ సుభ్రు। బాహులతికామేవం కురు స్థానకం
నాత్యుచ్చైర్నమ కుంచితాగ్రచరణం మాం పశ్య తావత్క్షణమ్।
గౌరీం నర్తయతః స్వవక్త్రమురజేనామ్భోధరధ్వానినా
శంభోర్వః సుఖయంతు లంభితలయచ్ఛేదాహతాస్తాలకాః॥

"అందమైన కనుబొమలదానా!
బాహు లతను ఈ విధంగా ఉంచు.
ఈ విధంగా నిలబడు.
నమస్కారముద్ర అంత యెత్తులో వద్దు.
అంతవరకూ పాదాన్ని వంకరగా ఉంచిన నన్ను చూడు. "
అంటూ గౌరిని నర్తింపజేస్తూ, మేఘగర్జనవంటి తన గంభీరకంఠమురజధ్వానం తోటి
పార్వతీదేవి నర్తనచేత తప్పుతున్న లయని సరిచేస్తూ శివుడు వేస్తున్న తాళం మనకి
సుఖదాయకమగుగాక!

~

శివుడి కౌతుకమే నాట్యావిర్భావానికి హేతువు. విశ్వమంతా తానే అయి ఉండి, శక్తి పరిస్పందన చేత భేదరూపాలని పొంది, నృత్తమాడాలని సంకల్పించుకున్నాడు ("యత్కౌతుకం కారణమాహురాప్తా నృత్తం న తత్కస్య భవేత్సుఖాయ" - నృత్తరత్నావళి). శివుడి నాట్యం అనాది. ఆయన విన్యాసం విశ్వాన్ని సూచిస్తుంది. ('ఆంగికం భువనం యస్య వాచికం సర్వవాఙ్మయం, ఆహార్యం చంద్రతారాది, తం వందే సాత్త్వికం శివమ్" - అభినయదర్పణం). నృత్తం ఆర్భటీ వృత్తితో ఉద్ధతంగా ఉండేది.

కరణాంగహారాలు శివుడి నాట్యంలోని భాగాలు. హరుడు ప్రయోగించింది హారము. శరీరాంగ సంబంధమైన హారమే అంగహారం. ఇవి పెక్కు సంఖ్యలో ఉన్నాయి. వీటికి కరణాలు ఉత్పాదకాలు. కరణమంటే హస్తపదాది అవయవాల సమరూపమైన విలాసవిక్షేపం. ఇవి నూటయెనిమిది. ఒక అంగహారానికి కొన్ని కరణాలు మాతృకలు అవుతాయి. ఈ సంఖ్య ప్రయోగింపబడే అంగహారాన్ని బట్టి ఉంటుంది. శివనృత్తం ఉద్ధతమైనది. దానికి పార్వతి తన స్వసహజధర్మమైన సౌకుమార్యాన్ని జోడించి లాస్యానికి జన్మ యిచ్చింది.

నిశ్చలమైన భంగిమకు స్థానకమని నాట్యశాస్త్రం లో పేరు. ఈ స్థానకాలను వేరువేరు క్రియాసన్నివేశాలను ప్రయోగించడానికి వాడతారు. భరతుడి ప్రకారం ఇవి పురుషస్థానకాలు (ఇవి ఆరు: వైష్ణవము, సమపాదము, వైశాఖము, మండలము, ఆలీఢము, ప్రత్యాలీఢము); స్త్రీస్థానకాలు (ఇవి మూడు: ఆయతము, అవహిత్థము, అశ్వకాంతము; అయితే సంగీతరత్నాకరమనే గ్రంథంలో వీటి సంఖ్య ఏడుగా ఉంది) అని రెండు రకాలు. స్థానకాలకు తాళభేదం ఉంటుంది. వీటి ప్రయోగం సన్నివేశానుసారి. ఉదాహరణకు వైశాఖస్థానకాన్ని అశ్వారోహము, వ్యాయామం, నిర్గమం, పెద్దపక్షుల ఆకారనిరూపణం, ధనుష్టంకారం వంటి వాటి ప్రయోగానికి ఉపయోగిస్తారు. దీనికి మూడున్నరతాళాల అంతరం ఉంటుంది. ప్రజల చేతులలో ఇవి మరిన్ని రూపాంతరాలు పొందాయనడానికి ఋజువునిస్తూ సంగీతరత్నాకరంలో స్వస్తికము, వర్ధమానము, నంద్యావర్తము ఇత్యాదిగా 23 దేశీయ స్థానకాలూ వర్ణించబడ్డాయి.

యుద్ధంలోనూ వీటి ఉపయోగం ఉంది. భీముడూ, జీమూతమల్లుడూ విరాటపర్వంలోని మల్లయుద్ధసన్నివేశంలో స్థానకభంగిమలలో ఉన్నారని తిక్కన వర్ణిస్తూ, 'వింత తానకంబుల నిలచి' అంటాడు. (విరాట, 2వ ఆ.) ఈ తానకం స్థానకానికి వికృతిరూపం. మల్లయుద్ధంలోనే కాదు, ధనుర్వేదం విలుకాని స్థానాలని వివరించింది. అవి సమపదం (బొటనవ్రేళ్లు, మడమలు, పాదాలు ఒకేవైపునుండి దూరంగా ఉండేది), వైశాఖం (రెండు పాదాలూ వ్రేళ్ల మీద ఆనిచి, మోకాళ్లు బిగించి ఉండగా, పాదాల మధ్య దూరం మూడు జానలుండాలి), మండలం (రెండు మోకాళ్లూ హంసపంక్తి లాగా నాలుగు జానల దూరంతో ఉండేది), ఆలీఢం (కుడి మోకాలు ముందుకు చాపినపుడు రెండు పాదాల మధ్య ఐదుజానల దూరముండాలి), ప్రత్యాలీఢము (ఎడమకాలు ముందుకు); వీటితో పాటుగా ఉన్నవి వికటము, సంపుటము అనే రెండు(అగ్నిపురాణం, 249అ.) . సహజంగానే ఇవి పురుషస్థానకాలు.

*

శివుడు గౌరికి నాట్య బోధ చేస్తున్నాడు. తగ్గ తాళమూ ఆయనే వేస్తున్నాడు.

శాస్త్రాంశాలు పక్కనపెడితే, ఈ ఊహే అమోఘమైనది. ఆమె 'సుభ్రు'. ఇది ఒక సొబగైన సంబోధన. కనుల అభినయానికి ప్రాధాన్యత ఉన్న నాట్యసన్నివేశంలో మాత్రమే బహుశా వాడతగినది. ఆమెకు అవసరమైన విధంగా ఆయన బోధ ఉంది. తెలియని క్రొత్త భంగిమలని నేర్పుతున్నాడని అనడానికి 'ఏవం' అన్న ప్రయోగం. 'ఏవం స్థాపయ బాహులతికాం' ఈ విధంగా బాహులతను ఉంచు అని. ఈ విధంగా అనడంలో ఆయన గౌరికి తాను అభినయిస్తూ చూపిస్తున్నాడన్నమాట. ఇది బోధలో మొదటి అంశం. ఆమె పొరపాట్లను సరిదిద్దడం రెండు. దానికి సూచకం 'నాత్యుచ్చైర్నమ' - నమస్కారం ఆమె అభినయిస్తున్నది. దానిని సరిదిద్దుతూ అంత యెత్తులో వద్దు అని అనడం. మూడు, ఆమెకు తన బోధ తరువాత అవబోధమవని వాటికి తనను ఆదర్శంగా తీసుకొమ్మని చెప్పడం. దానికి సూచకం ' కుంచితాగ్రచరణం మాం పశ్య'. ఇక్కడ తన అగ్రచరణాన్ని కుంచితమైన భంగిమలో ఆయన ఉంచి, తనను చూడమని చెబుతున్నాడు. ఆయన తాళానుగుణంగా చేస్తున్న శబ్దాలలోని గంభీరత అంభోధరధ్వనిని పోలి ఉంది. ఆయన గొంతుని మృదంగంతో పోల్చాడు కవి.

ఈ ప్రయోగంలో అధికారం, జ్ఞానం రెండూ సమ్మిళితాలు. భార్య కనుక ఆయన మాటలలో శృంగారమూ సొగసుగా మిళితమై ఉంది.

ఆయనను మించిన గురువెవరు?

వక్త్రమురజము - మృదంగం వంటి గొంతు. - విలక్షణమైన ఊహ.
లంభితము - ప్రయోగింపబడినది.

2.
అల్లరి
సురకో 59
శార్దూలవిక్రీడితం

శ్లో.

మాతర్ జీవ కిమేతదంజలిపుటే తాతేన గోపాయితం
వత్స స్వాదుఫలం ప్రయచ్ఛతి న మే గత్వా గృహాణ స్వయమ్।
మాత్రైవం ప్రహితే గుహే విఘటయత్యాకృష్య సంధ్యాంజలిం
శంభోర్భగ్నసమాధిరుద్ధమనసో హాస్యోద్గమః పాతు వః॥

గుహుడు: అమ్మా!
పార్వతి: చెప్పురా.
గు: నాన్న దోసిలిలో దాచిపెట్టిన వస్తువేమిటి?
పా: అదా, అది తీయని పండురా కన్నా!
గు: అలాగా! నాకు ఇస్తాడా మరి?
పా: ఎందుకివ్వడు? నువ్వే వెళ్లి తెచ్చుకో. "

ఆ అమ్మ మాట విని, తన సంధ్యాంజలిని చెదరగొట్టి, సమాధిభగ్నం కావించిన బాలకుమారస్వామిని చూసి ఉబికివచ్చిన శివుని నవ్వు మనలను రక్షించును గాక!

*

ఒక లేతవయసు పిల్లవాడూ, సంసారానికి మించి ఆత్మరిరంసకి ప్రాధాన్యతనిచ్చే ఒక మహాయోగి, అటువంటి ఒక భర్తతో వేగుతూ సంసారాన్ని చక్కబెడుతున్న ఒక ఇల్లాలూ (“కపాలీ భూతేశో భజతి జగదీశైకపదవీం భవాని త్వత్పాణిగ్రహణపరిపాటీఫలమిదమ్” - శంకరులు) ఉన్నటువంటి శివకుటుంబం తప్ప ఇటువంటి కవితాద్రవ్యాలు కలిగిఉన్న చోటు ఈ ప్రపంచంలో మరొకటి దొరకటం ఎంత అసాధ్యమో, ఆ చోటుని చూడగలిగిన యోగేశ్వరుడి వంటి మహాకవి ఉండడమూ అంతే అరుదు. అసలు ఇటువంటి ఊహ సాధ్యపడటానికి ఇందులోని పాత్రౌచిత్యాలని చూడగలిగిన కవి ప్రతిభ ప్రధాన కారణం.

గోపాయితం - దాచిపెట్టబడ్డది. మంచి క్రియాపదం
భగ్నసమాధిరుద్ధమనస్సు - భగ్నం కావింపబడిన సమాధితో అడ్డుకున్న మనస్సు.
సమాధితో మనసుని (ఆలోచనలని) అడ్డగించేడు శివుడు ("యోగః చిత్తవృత్తినిరోధః" - పతంజలి).
అది కుమారుడి చేష్టతో భంగం కావింపబడింది.

శివుడి మనఃస్థితి ఎన్నో మలుపులు తిరిగింది. సమాధినుండి చెదరగొట్టినపుడు సాధారణంగా పుట్టే క్రోధం ఎదురుగుండా కుమారుడ్ని చూడగానే తద్వ్యతిరేకమైన నవ్వుగా పరిణమించింది. ఆ పరివర్తన వ్యక్తీకరణ అయ్యే దశకు సైతం చేరుకోలేదు. ఇది శివుడి సర్వజ్ఞత్వాన్ని చూపిస్తోంది.

ఈ కవితలో అల్లరి నాన్న దోసిలిలో ఏదో దాగి ఉందని అనుకున్న స్కందుడిదా? ఆయన సమాధిలో ఉన్నాడని తెలిసీ, ఉన్నది పండు, వెళ్లి తెచ్చుకొమ్మన్న స్కందమాతదా?

**

3

హరశిరస్సు

సదుక్తి 42

శార్దూలవిక్రీడితం

శ్లో.

సంధ్యాతాండవితస్య ఖండపరశోరవ్యాజ్జగంతి జ్వల-
ల్లాలాటాక్షి-పుటోద్భవానల-శిఖా-లీఢేందులేఖం శిరః।
భ్రశ్యత్కృత్తి చలన్మహాహి విగలద్వ్యోమాపగాంబుస్ఖలత్
ఖండేందూచ్ఛలదచ్ఛభూతి-చటుల-భ్రామ్యజ్జటాసంతతిః॥

సంధ్యాతాండవవేళలో
జ్వలల్లలాటనేత్రజనితాగ్నిశిఖల చేత తినివేయద్ద ఇందులేఖా;
వదులైన గజచర్మమూ;
తొట్రుపడుతూ చలిస్తున్న భుజగపతీ;
జారుతున్న గంగాతరంగాలలో పడిపోతున్న చంద్రఖండమూ;
ఎగసిపడుతున్న విబూది పెళ్లల తునకలూ;
వంకరటింకరగా భ్రమిస్తున్న జటాసంతతీ -
వీటిని కలిగిఉన్న ఖండపరశువు శిరసు జగత్తులని రక్షించునుగాక.

~

ఈ శ్లోకం వైదర్భీరీతిలో చెప్పబడిన ప్రౌఢమైన రచన. పాండిత్యస్ఫోరకంగా ఉంది.

శివుడిని ఆశ్రయించుకుని ఉన్న వస్తుసంచయం ఆయన కరుణంత పెద్దది అనిపిస్తుంది.

శివతాండవసమయంలో అవన్నీ కుదుపుకి లోనుకావడం ఆయనచుట్టూ పరివేష్టితమైన దేవసమితికీ, భక్తకోటికీ కలిగించిన ఆనందం నేను మాటలలో పెట్టలేనిది. సంధ్యాసమయంలో ఆనందతాండవమాచరిస్తున్నాడు స్వామి. ఆ అభినయోద్రేకంలో రసంలో లగ్నమైన మనసుతో ఆడుతున్నాడు. ఆయనకు రససిద్ధి సహజగుణం కనుక, శరీరం మీద స్పృహ లేదు. ఆయన ఫాలంమీద తృతీయనేత్రపుటం నుండి అనలశిఖలు ఎగసిపడుతున్నాయి. చంద్రుడి ఆనవాలు కనపడనంతగా. అవి చంద్రుడ్ని తినివేసాయట. (లీఢ - తినివేయబడిన). గంగానదికి తనమీద తనకు అదుపు లేదు. కల్లోలాలుపోతూంది. దగ్గరగా ఉన్న చంద్రుడ్ని అల్లకల్లోలం గావిస్తోంది. విబూది రాలిపడుతోంది. జటలు ఊగిపోతున్నవి. శివతాండవమూర్తిని ఎంతో దగ్గరగా తీసుకుంటే తప్ప ఇటువంటి ఊహ చేయడం కుదరని పని. ఈ ఊహలలో ఒకటో లేదా కొన్నింటినో మనం అనేక శివస్తుతులలో చూడవచ్చు. యోగేశ్వరుడు తెలియకుండానే తరువాతి వాళ్లకు అనుసరణీయుడైనాడు. మచ్చుక్కి ఒక ఉదాహరణ చూపుతాను. శివుడు పార్వతిని ముద్దాడుతున్నాడట. అపుడు ఒక అజ్ఞాతకవి దర్శించిన శివాశ్రితజీవుల పరిస్థితి ఇది -

జటాగుల్మోత్సంగం ప్రవిశతి శశీ భస్మగహనం
ఫణీంద్రోఽపి స్కంధాదవతరతి లీలాంచితఫణః।
వృషః శార్యం కృత్వా విలిఖతి ఖురాగ్రేణ నయనం
యదా శంభుశ్చుంబత్యచలదుహితుర్ వక్త్ర కమలమ్॥

శంభుడు అచలదుహిత వక్త్రకమలాన్ని ముద్దుపెడుతున్నపుడు చందురుడు బూదిపూతల జడల ఒడిలోకి జారుకున్నాడట. నాగరాజు భుజం మీదనుండి దిగి తన పడగలో దాక్కున్నాడట. టక్కరి నంది తన గిట్టలతో కనులు మూసుకున్నాడట!

4.

హరశిరోగంగా

సదుక్తి 46

శిఖరిణి

శ్లో.

కపాలే గంభీరః కుహరిణి జటాసంధిషు కృశః
సముత్తానః చూడాభుజగమణిబంధవ్యతికరే।
మృదుర్లేఖాకోణే రయవశవిలోలస్య శశినః
పునీతాత్ దీర్ఘం వో హరశిరసి గంగా కలకలః॥

కపాలం దగ్గర లోతులు కలదై
జటాసంధులలోనూ, ముడులలోనూ చిక్కి;
నాగమణీ, శిఖా కలిసేచోటులో దొప్పలాగా తిరగబడి,
తన ప్రవాహవశుడైన బాలచంద్రుడి కోణాలలో మాత్రం మృదువుగా ఉన్నటువంటి
గంగాప్రవాహపు హళాహళి
మిమ్మల్ని సుదీర్ఘకాలపర్యంతం పునీతులను చేయుగాక.
*

ఈ శ్లోకం చాలు యోగేశ్వరుడి ప్రాణాలు శివుడికి వశమైపోయేయని చెప్పటానికి. గంగావతరణాన్ని వర్ణించిన కవులున్నారుకానీ, శివుని శిరసుపైకి దిగినతరువాత ఆమె స్వరూపాన్ని వర్ణించిన ఏకైక కవి యోగేశ్వరుడే అయుంటాడు. ఈ ఊహ ఒక అపరంజి. శివుడి జటాబంధాలలో ఉన్నటువంటి గంగ, ఆయన కపాలం దగ్గరినుండీ, జుత్తుపై శిఖవరకూ క్రింద నుండీ పైకి ఎటువంటి రూపాలను తీసుకుంటుందో, ఆ కలకలపు వైచిత్రి ఎలా ఉంటుందో చూడగలిగినవాడు మహాకవి కాక ఇంకెవరవుతారు?

భక్తుడికి మాత్రమే కుదరగలిగే ఊహ.

5.

హరనృత్యారంభం

సదుక్తి 12

శార్దూలవిక్రీడితం

శివతాండవం ఎలా ఉంటుందో మనకు తెలుసు. తాండవప్రారంభానికి ముందు సన్నివేశమేమిటో యోగేశ్వరుడికే తెలుసు. ఆయన ఈ వస్తువుతో రెండు కవితలల్లాడు.

శ్లో.

నందిన్ ఖంజనమంజునాదమురజం సంగృహ్యా సజ్జీభవ
కుష్మాండానయ భస్మభాజనమితో లంబోదరాగమ్యతామ్।
స్కందం నందయ మందిరోదరగతం దేవీతి రంగాంగణే
శంభోస్తాండవమండనైకమనసః సంజల్పితం పాతు వః॥

"నందీ! కాటుకపిట్ట ధ్వని లాంటి మంజునాదం చేసే మృదంగంతో సిద్ధంకా!

కూష్మాండా! విబూదిడబ్బాలను ఇటు తీసుకో!

లంబోదరా! ఇలా రా!

దేవీ! స్కందుడు చావడిలోకి పరుగెత్తాడు. వాడిని సంతోషపెట్టు!"

అని తన తాండవోత్సవానికి ముందు అందరినీ సంబాళిస్తున్న శివుని మాటలు మిమ్మల్ని ప్రోచుగాక.

~

మృదంగధ్వనిని కాటుకపిట్ట కూతతో పోల్చడం ఈ కవికే చెల్లింది. శివతాండవం మీద ఎంతటి ఉపాసన చేసి ఉండకపోతే ఇటువంటి ఒక ఊహని యోగేశ్వరుడు చేయగలిగి ఉంటాడు?

కాటుకపిట్ట కంఠాన్ని ఇక్కడ వినవీలవుతుంది-

https://www.youtube.com/watch?v=MtK0AxVAIlk

**

శ్లో.

భో భో దిక్పతయః ప్రయాత పరతః ఖం ముంచతాంభోముచః
పాతాలం వ్రజ మేదిని ప్రవిశత క్షోణీతలం క్ష్మాభృతః।
బ్రహ్మన్నున్నయ దూరమాత్మసదనం దేవస్య నో నృత్యతః
శంభోస్సంకటమేవదిత్యవతు వః ప్రోత్సారణా నందినః ॥

"దిక్పతులారా! చుట్టూ ఖాళీచేయండి.

మేఘాల్లారా! గగనాన్ని విడిచిపెట్టండి!

మేదినీ! పాతాళాన్ని ఆశ్రయించు!

పర్వతాల్లారా! భూమిలోకి క్రుంగిపొండి!

బ్రహ్మదేవా! నీలోకానికి ఎగిరిపో!

నర్తిస్తున్న మన శివస్వామికి తగినంత చోటు కావాలి. మీరుంటే ఇబ్బంది"

అంటూ నంది చేస్తున్న జరుపుళ్లు మిమ్ములను రక్షించుగాక!

*

6.

గణోచ్చావచము
సురకో 71
శార్దూలవిక్రీడితం

"ఏవిటలా నిల్చున్నారు!
దేవి కుమారుడ్ని ప్రసవించింది, నర్తించరేం?! ఆడండి! "
అంటూ తన భూజాలను పైకెత్తి
భృంగిరిటి హర్షంతో పురికొల్పుతుండగా,
అడగకుండానే చాముండ
ఆయన్ను ఆనందాలింగనం చేయగా,
అక్కడ మ్రోగుతున్న దుందుభిస్వనాన్ని అతిశయిస్తూ
వారిరువురి అస్థిపంజరకంకాళాలు ఢీకొనగా పుట్టిన ధ్వని
మిమ్మల్ని రక్షించుగాక!

~
శ్లో.

దేవీ సూనుమసూత నృత్యత గణాః కిం తిష్ఠతేత్యుద్భుజే

హర్షాద్భృంగిరిటావయాచితగిరా చాముండయాలింగితే

అవ్యాద్వో హతదుందుభిస్వన ఘన ధ్వానాతిరిక్తస్తయోః

అన్యోన్యప్రచలాస్థిపంజర రణత్కంకాళ జన్మా రవః.

7.

హరిహరమూర్తి
సదుక్తి 168
మాలిని

శ్లో.

స్ఫటికమరకతశ్రీహారిణో ప్రీతియోగాత్
తదవతు వపురేకం కామ కంస ద్విషోర్వః।
న విరమతి భవాన్యాః సార్ధమబ్ధేర్దుహిత్రా
సదృశమహసి కంఠే యత్ర సీమావివాదః॥

ఏ మూర్తి కంఠసీమలో
ఎంతవరకూ శివుడితో, ఎంతవరకూ విష్ణువుదో
అన్న వివాదం భవానీలక్ష్మీదేవుల మధ్యన
ఎన్నటికీ తెగదో,
ఆ స్ఫటికము యొక్కా, మరకతము యొక్కా
కాంతులను హరిస్తూన్నటువంటి
కామరిపువు, కంసరిపువు కలగలిసిన
హరిహరమూర్తి రక్షించుగాక!
~

హరిది మరకతశ్యామరూపం. హరుడిది స్ఫటికకాంతులతో పోటీపడే రూపు. ఇద్దరూ కలిసినపుడు ఎవరెవరో అన్న సంగతి వారి భార్యలైన లక్ష్మీపార్వతులకు బాగానే తెలుస్తోంది. కంఠం వద్దకు వచ్చేసరికి విష్ణువు కంఠం సాధారణంగానే నల్లనిది. గరళకంఠుడైన శివుని కంఠం నలుపెక్కినది. అందువల్ల ఆ సమ్మిలితమూర్తిలో విష్ణువు కంఠం ఎంతవరకూ ఉందో, శివకంఠం ఎంతవరకూ ఉందో అన్న గొడవ వారి సతీమణుల మధ్యన తేలట్లేదట.
మనోహరకల్పనావైభవం.

8.

అర్ధనారీశ్వరుడు

సదుక్తి 133

శార్దూలవిక్రీడితం

శ్లో.

చంద్రాలోకయ పశ్యపన్నగపతే వీక్షధ్వమేతద్గణాః
కామారేః స్తనభారమంథరమురో లాక్షారుణాంఘ్రిశ్రియః।
ఆకర్ణ్య త్రిదశాపగాగిరమిమాం సోల్లాసమాభాషితాం
వ్రీడాస్మేరనతాననో విజయతే కాంతార్ధనారీశ్వరః॥

"చంద్రుడా, ఇదిగో చూడు!

నాగరాజా! నీవు కూడా.

భూతగణాల్లారా! మీరూ పరికించండి.

పురుషుడైన కామారి యొక్క స్తనభారమూ, పారాణితో ఎర్రబడిన పాదమూను!"

అని వ్యంగ్యంగా అంటున్నటువంటి గంగ వేళాకోళాన్ని విని

సిగ్గునవ్వు తెచ్చుకుని తలదించుకున్న అర్ధనారీశ్వరుడు జయాన్ని పొందుతున్నాడు.

~

గంగకు పార్వతి సవతి. తనకు లేని అదృష్టం గౌరికి దక్కిందని కలుక్కుమనే ఉంటుంది ఆమెకు. ఆ అక్కసుతోనే ఈ గేలి. ఇటువంటి ఒకకవిత శివుడి దగ్గర తప్ప సాధ్యమయ్యే వేరేచోటు ఈ ప్రపంచంలో ఉందా?

త్రిదశాపగ అంటే దేవతల ఏరు.

9.

భృంగి అచ్చెర్వు

సదుక్తి 151

శార్దూలవిక్రీడితం

శివభక్తాగ్రేసరుడైన భృంగి తన స్వామిని చూసి ఇలా తలపోస్తున్నాడు.

శ్లో.

దిగ్వాసా యది తత్కిమస్య ధనుషా సాస్త్రస్య కిం భస్మనా
భస్మాథాస్య కిమంగనా యది చ సా కామం పరిద్వేష్టి కిమ్।
ఇత్యన్యోన్యవిరుద్ధచేష్టితమిదం పశ్యన్నిజస్వామినో
భృంగీ సాంద్రసిరావనద్ధవపుషం ధత్తేఽస్థిశేషం వపుః॥

*

"ఈయన దిగంబరుడు.

మరి దిగంబరుడైతే ధనుస్సు (పినాకం) తో ఏమి పని?
పని ఉందని అనుకుందాం.
అస్త్రశస్త్రాలున్నవాడు బూది వాడటమేవిటీ?
బూది వాడే యోగియే అనుకుందాం.
యోగి అయినవాడికి ఆడదానితో పని ఏమిటి?
సరే, ఆడది ఉందనే అనుకుందాం.
స్త్రీని దగ్గరపెట్టుకున్నవాడు మన్మథుడిని ద్వేషించడమేమిటి?"

ఇలా అన్యోన్యవిరుద్ధచేష్టితాలతో కూడి, రక్తమాంసాలతో నిండిన శరీరంతో ఉన్నటువంటి తన స్వామిని ఆశ్చర్యంతోనే తదేకంగా చూస్తూ భృంగి ఎముకలను మాత్రమే మిగుల్చుకున్నాడు.

భృంగి గురించి ఒక కథ చెబుతారు. భృంగి మహాశివభక్తుడు. కైలాసానికి వెళ్లి శివుడికి భక్తితో ప్రదక్షిణ చేస్తున్నాడు. పక్కనే పార్వతి ఉంది. ఆమెను భృంగి పట్టించుకోలేదు. దానితో ఆవిడ శివుని పక్కకు వచ్చింది. అయినా తప్పించుకుని శివుడికి మాత్రమే ప్రదక్షిణ చేసాడు. అపుడు ఆమె శివుడిలో సగం కలిసిపోయింది. శివుడిమీద మాత్రమే ధ్యాస ఉన్న భృంగి ఒక తుమ్మెద రూపం ధరించి, పార్వతిని విడిచిపెట్టి సగం శివభాగానికి మాత్రమే ప్రదక్షిణ చేసాడు. కోపించిన పార్వతీ దేవి, "నన్ను నిరసించావు కనుక, నీ తల్లినుండి నీకు సంక్రమించినదంతా పోగొట్టుకొందువుగాక' అని శపించింది. తల్లి నుండి సంక్రమించే రక్తమాంసాదులన్నింటినీ కోల్పోయి కేవలం ఎముకల కుప్పగా మిగిలాడు భృంగి. తరువాత శివశక్తుల ఏకత్వాన్ని తెలుసుకోవడం, ఎముకలగూడు రెండు కాళ్లతో నిలవడం కష్టం గనుక శివుడతడికి మూడవ కాలు ఇవ్వడం తరువాతి కథ.

ఆ కథని కవితామయం చేసాడు యోగేశ్వరుడు. ఇటువంటి ఒక కల్పనకు ఏ మనఃస్థితి కావాలి? ఎటువంటి ఉత్ప్రేరకం తగిలితే ఒక కవి ఇటువంటి ఊహ చేయగలడు? ఏ ఉల్బణాన్ని చేరుకుంటే ఇటువంటి ఒక కవిత బయటకు రాగలదు? ఇంత మనోహరమైన కవిత చదివాక, భృంగికి తనస్వామిని చూసి కలిగిన ఆశ్చర్యంలో సగమైనా మనకు యోగేశ్వరుడిపైన కలగకపోదు.

వినయదేవుడనే కవి, ఇదే శైలిలో, పార్వతీదేవి పడిన మల్లగుల్లాలని ఇలా వర్ణించాడు -

దిగ్వాసా ఇతి సత్రపం మనసిజద్వేషీతి ముగ్ధస్మితం
సాశ్చర్యం విషమేక్షణోఽయమితి త్రస్తం కపాలీతి చ।
మౌలి స్వీకృతజాహ్నవీతి చ ప్రాప్తాభ్యసూయం హరః
పార్వత్యాః సభయం భుజంగవలయీత్యాలోకితః పాతు వః॥

దిగంబరుడని జుగుప్స. మన్మథుడంటే చికాకని (పరస్త్రీగమనముండదు కనుక) ముగ్ధమైన నవ్వు. మూడుకనులవాడని ఆశ్చర్యం. పుర్రెలుంటాయని భయం. శిరసుమీద ఇంకొక స్త్రీని పెట్టుకున్నాడని అసూయ. పాములున్నాయని ఏహ్యం. ఇన్ని రకాలుగా చూస్తోందట పార్వతి శివుడిని.

~

భగవంతుడి కుటుంబాన్ని కవిత్వదృష్టితో చూసి, ఔచిత్యవంతమైన కల్పన చేయడం ద్వారా స్తుతిసాహిత్యాన్ని కల్పించడమనే మార్గాన్ని యోగేశ్వరుడు తొమ్మిదవ శతాబ్దంలోనే బలపరిచాడు. ఎప్పటివాడీ యోగేశ్వరుడు? అయినా, అల్లసాని పెద్దన "అంకము జేరి' అని తన కావ్యాన్ని ప్రారంభించినపుడూ, రాయలు 'శ్రీ కమనీయ హారమణి' అంటూ తన కృతికి శ్రీకారం చుట్టినపుడూ, కొంతకాలం ముందువరకూ మహాకావ్యాలు పుట్టించిన ప్రతీ కవీ మొదటిపద్యాన్ని స్తుతిప్రధానంగా వ్రాసినపుడూ, ఏ భావకుడో తన ఇష్టదైవం మీద కల్పన చేసి కవితనల్లినపుడూ, యోగేశ్వరుడు నిర్మమగా తొంగిచూస్తూనే ఉన్నాడు. అత్యంత విరళమైన కవితాసంప్రదాయమది. దానిని పదిలపరుచుకోవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది.

***

4
యోగేశ్వరుడు: గ్రామకవిత్వం

ఉచ్ఛ్మశ్రుర్వ్యాత్తవక్త్రః ప్రవితత-రసనా-పల్లవాలీఢసృక్కా-
పింగోగ్రభ్రాంతనేత్రః పులకిత-తరలోత్తాన-లాంగూలనాళః
కుత్రాప్యక్లాంతగామీ క్వచిదతిపిహితః క్వాపి తుంగాగ్రమాత్రః
చిత్రవ్యాఘ్రోయమాప్తుం ప్రమదవనమృగీ తర్ణకాంస్తూర్ణమేతి.
(సదుక్తి 2017 ,స్రగ్ధర)

ఒక చిత్రవ్యాఘ్రం(చిరుత). దాని మీసాలు పైకిదేరి ఉన్నాయి (ఉచ్ఛ్మశ్రుః). తన నోటిని తెరుస్తోంది (వ్యాత్తవక్త్రః). బారచాపిన ఎర్రటి నాలుకతో క్రిందిపెదవిని వాడిగా నాకుతోంది (ప్రవితత-రసనా పల్లవాలీఢసృక్కా). దాని పింగళవర్ణపు కళ్లు కదలాడుతున్నాయి (పింగోగ్రభ్రాంతనేత్రః). వెల్లకిలా త్రిప్పిన దాని తోకకట్టులో ఒక గగుర్పాటు ఉంది(పులకిత తరళోత్తాన లాంగూలనాళః). ఆ చిరుత స్త్రీల ఉద్యానవనాలలోని లేడిపిల్లలను(మృగీ-తర్ణకాన్) వడిగా వేటాడడానికి వస్తోంది. ఆ గమనం ఎన్ని విధాలు? ఒక్కోచోట చురుకుగా పరుగులు తీస్తూ ఉంటే (అక్లాంతగామీ),ఒక్కోచోట అతిరహస్యంగా దాక్కుంటోందట (క్వచిదతిపిహితః). ఒక్కోసారి ఏ ఎత్తు మీదకో ఎక్కి ఎదురుచూస్తోంది(క్వాపి తుంగాగ్రమాత్రః).

ఇదే కవిత. ఇంతే. ఈ కవిత ఏ కావ్యంలోని సన్నివేశంలోనో భాగమైనది కాదు. ఒక ముక్తకం. కవితాసంవిధానంలో ఒక మలుపు. సంస్కృతసాహిత్యంలో ఆలంకారిక మార్గం ఒకటీ, అర్థగౌరవమార్గం ఒకటీ, పదలాలిత్యపు మార్గం ఒకటీ ఏర్పడి, పుట్టిన ప్రతీకవినీ ఏదో ఒక మార్గంవైపుకో లేదా పై వాటిలో రెండుమూడు మార్గాలను కలగలిపి వేరే మార్గంవైపుకో లాక్కుంటున్న రోజులలో పుట్టిన యోగేశ్వరుడనే ఈ కవివతంసుడు ఒకచోట బాసెంబట్టు వేసుకుని కూర్చుని, ధ్యానంలో కుదురుకుని, వస్తువర్ణన చేస్తూ ఊహావైభవాన్ని ప్రదర్శించడమనే ఫణితికి స్వస్తి

పలికాడు. తన కాళ్లకు పనిచెప్పాడు. నడిచాడు. ప్రకృతిని చూసాడు. ఆ చూపులోనే, ఆ తిరుగుళ్లలోనే సమాధిని అనుభూతి చెందాడు. కవితని కన్నాడు.

'అదివో అల్లదివో' అంటూ దైవస్థానాన్ని ఎదురుగా చూసిన అన్నమయ్య శరీరం ఏవిధంగా పులకలువారిందో, ఒక పల్లెటూరినీ, ఒక పల్లెపడుచునీ, ఒక పశువునీ, ఒక పంటనీ చూసిన యోగేశ్వరుడి గుండె అలానే ఉప్పొంగింది. పరోక్షంగానో, అపరోక్షంగానో ఒకానొక దృశ్యాన్ని పాఠకుడి మనస్సులో సాక్షాత్కరింపజేయడం కవిత్వానికున్న పరమప్రయోజనాలలో ఒకటి. ప్రపంచసాహిత్యంలో వేవేల దారులున్నా, అవన్నీ ఈ లక్ష్యానికే చేరుకోవాలి. యోగేశ్వరుడు ఈ లక్ష్యసాధనలో ఒక కొత్తమార్గాన్ని సాహిత్యంలో తయారుచేసాడు. ప్రేమనూ, పురవర్ణననూ విడిచిపెట్టి నానాపశువులనూ, గ్రామకరణాన్నీ వర్ణించాడు. రాజప్రసాదాలనూ, ఉద్యానవనాలనూ మాని దరిద్రగృహిణినీ, పామరులనూ గానం చేసాడు. నగరాలనూ నగారాలనూ విడిచిపెట్టి కొండకూ పంటకూ తానే ఒక తీవెగా అల్లుకునిపోయాడు.

యోగేశ్వరుడి కవిత్వంలో ప్రధానప్రాణం సాక్షాత్కారమైతే, రెండవ పట్టు పదాల కూర్పు. ఉన్నది ఉన్నట్లు చెబుతున్నాడు కదా అని ఈయన కవిత పేలవమైనది కాదు. ఉపమో, రూపకమో లేని ఈతని కవిత పలుచనిది కాదు. అవి చుట్టుకోవాల్సిన అవసరంలేనిది. యదృచ్ఛగా, స్వచ్ఛంగా ప్రకాశించేది. చిరుత వెల్లకిలా చాపిన తోకలో గగుర్పాటును గమనించేత సునిశితమైనది ఈతని దృష్టి. వస్తువూ, వర్ణనా పూర్తి క్రొత్తవి కావడం చేత, ఈతని భాషసైతం కూడా ఒక కొత్త రసవిద్యలానే అగుపిస్తుంది.

ఎద్దుపైన ఈతని కవితను చూడండి -

తిర్యక్-తీక్ష్ణ-విషాణయుగ్మ-చలన-వ్యానమ్ర-కంఠాననః
కించిత్-కుంచిత-లోచనః ఖురపుటైరాచోటయన్ భూతలమ్
నిశ్శ్వాసైరతిసంతతైః బుసకణాజాలం ఖలే విక్షిపన్
ఉక్షా గోష్ఠతటీషు లబ్ధవిజయో గోవృందమాస్కందతి.

(సురకో 1186, శార్దూలవిక్రీడితం)

వంకరైన రెండు వాడి కొమ్ములతో పొడుస్తూ మోరనూ కంఠాన్నీ వంచిందట. దాని చూపు కొద్దిగా వక్రంగా ఉన్నదట. గిట్టలతో భూమిని తవ్వుతున్నదట. మిక్కిలిగా నిశ్వసిస్తూ ఊకను నూర్పిడిమిట్ట నుండి చుట్టూ చిమ్ముతున్నదట. ఇంత విహారం చేస్తూ కొట్టంలో ఎద్దు ఆవులమందపై పడుతున్నది. *ఖురపుటైరాచోటయన్ భూతలం*- ఇటువంటి పోహళింపును మనమెక్కడా గమనించం. బుసకణాజాలం - ఆ ఎద్దు ఫూత్కారంలోని బుస్సులను స్ఫురింపచేస్తున్నట్లే ఉంది.

నీకైనేనేరినవేయే ధ్వనులో అన్నాడు శ్రీశ్రీ. ఈ కవికూడా అదే విధంగా తన కవిత కోసం పదాలను అతిజాగ్రత్తగా ఏరుకున్నాడు.

యోగేశ్వరుడు వింధ్యపర్వతాలను గురించి కుత్తుక నిండుగా గానం చేసాడు. పశువులను వర్ణించాడు, ఋతువులను మనకు హృదయంగమంగా చూపించాడు. శివుడిని మనముందు సాక్షాత్కరింపజేసాడు. ఈ కవితలను నేను రెండేళ్లకు మునుపే పరిచయం చేసినా, ఆయన్ను గ్రామకవి అనే పిలిచాను. దానికి కారణం ఇతడు నెత్తిమీదకెత్తుకున్న ఆనాటి గ్రామీణ భారతమే. ఎక్కడో పైలోకాలల్లో దేవతలు సల్లాపాలాడుకునే గీర్వాణభాషను పల్లెల్లో పారించాడీ కవి. చలికాలంలో ఈ కవి చూసిన పల్లెని మీరూ చూడండి-

ఉద్వేగం జనయంతి సంచితవృష-వ్యాప్తాజిరోపాంతకాః
ప్రాతః శీర్ణకుటీర-పుంజిత-లతాశిమ్బి-తుషారావిలాః
గ్రామా గోమయధూమ-సంతతి-పరిక్లిష్టారుణ-శ్మశ్రుభిః
వృద్ధైః కుడ్యనివాత-లీన-నిభృతైరభ్యర్థ్యమానాతపాః

(సదుక్తి 1351, శార్దూలవిక్రీడితం)

ఇళ్ల వాకిళ్లలో క్రిక్కిరిసి పడుకున్న ఎద్దుల గుంపులతో
ప్రొద్దునే శీర్ణకుటీరాలపై మంచు పేరుకుని పాడైపోయిన పొగాకుతీగెలతో
గోడలకు కుదిరినంత తమని తాము అదుముకుని ఎండకోసం ప్రార్థిస్తున్న

గోధూళి అంటుకుని ఎర్రబడిన మీసాల ముసలివాళ్లతో
గ్రామాలు ఉద్వేగాన్ని కలిగిస్తున్నాయి.

గోధూళివేళ లేచిన ఎర్రటి దుమ్ము ముసలివాళ్ల మీసాలకు ఎరుపును దిద్దడం ఈ కవి చూసాడు (గోమయధూమ-సంతతి-పరిక్లిష్టారుణ-శ్మశ్రుభిః). వారు ఎండకోసం అభ్యర్థించడమూ చూసాడు. ఇంతటి సౌందర్యాన్ని, రామణీయకతనూ పల్లెల్లో చూసిన ఈ కవి వేరే చోటకి పోలేకపోవడంలో ఆశ్చర్యం లేదు.

గ్రామాలల్లో హేమంతసంధ్యను ఈ కవి ఎలా అనుభూతి చెందేదో చూడండి -

గర్వాయంతే పలాలం ప్రతి పథికశతైః పామరైః స్తూయమానాః
గోపాన్ గోగర్భిణీనాం సుఖయతి బహళో రాత్రిరోమంథబాష్పః
ప్రాతః పృష్ఠావగాఢప్రథమ రవిరుచిః గ్రామసీమోపశల్యే
శేతే సిద్ధార్థపుష్ప-చ్ఛద-నిచిత-హిమ-క్లిన్న-పక్ష్మా మహోక్షః.
(సురకో 297, స్రగ్ధర)

చలి బాగా ముప్పిరిగొన్న ఆ గ్రామంలోని ఊరివాళ్లను ఆ వైపుగా వెడుతున్న పాంథులు చలికాచుకోవడానికి వట్టిగడ్డి కోసం కాకాపడుతుంటే గర్వపడిపోతారట. గోపాలురకి రాత్రి చలినుండి రక్షించే దిక్కేది అంటే, కడుపుతో ఉన్న ఆవులు నెమరువేస్తున్నపుడు వాటి నోటినుండీ, నిట్టూర్పుల నుండీ వచ్చే వేడట! మరి, ప్రొద్దు ప్రొద్దునే మొదటి లేలేత రవికిరణాల తాకిడి సుఖాన్నునుభవించేది - ఊరిపొలిమేరలో ఆవపూవుల దగ్గర పరచుకుని పడుకున్న ఆబోతట. అదెలా ఉన్నదీ అంటే, మంచు చేత దాని కనుబొమ్మలు తడిసిపోయాయట.

బహలమన్నా బహులమన్నా ఒకటే. రాత్రిరోమంథబాష్పము - రాత్రిపూట నెమరువేస్తుండగా వచ్చే ఆవిరి. ఉపశల్యమంటే ఊరి పొలిమేర. ఈ భాష గ్రామాల సంస్కృతమేమో. తెలవారగానే ఆ మహోక్షపు సుఖమే సుఖము. అది ప్రాతః పృష్ఠావగాఢప్రథమ రవిరుచిః - ప్రొద్దున్నే తన

వెనుకభాగం చేత తెలిసికొనబడిన మొదటి రవికాంతి గలది. హిమక్లిన్నపక్ష్మా - మంచుతో తడిసిన పక్ష్మాలు కలది.

ఈ కవితలన్నీ యోగేశ్వరుడి యాత్రాచారిత్రమే. ఈ కవికి కనుసైగ కోసం నిరీక్షిస్తూ వింజామరలు వీస్తున్నటువంటి శత్రుకాంతలు కలిగిన మహరాజులు కనబడలేదు. గ్రామ్యనాయకుడు కనబడ్డాడు. రాత్రిపూట ఆతని స్థితి ఇలా ఉంది -

బ్రీహిః స్తమ్బకరిః ప్రభూతపయసః ప్రత్యాగతా ధేనవః
ప్రత్యుజ్జీవితభిక్షుణా భృశమితి ధ్యాయన్నపేతాన్యధీః ।
సాన్ద్రోశీరకుటుమ్బినీస్తనభరవ్యాలుప్తఘర్మక్లమో
దేవే నీరముదారముజ్ఝతి సుఖం శేతే నిశాగ్రామణీః
(సదుక్తి 893, శార్దూలవిక్రీడితం)

బైట వరుణుడు ఉదారంగా వృష్టిని కురిపిస్తూంటే -
ధాన్యం కుప్పలుగా సర్దబడింది.
తప్పేళాల నిండుగా పాలిచ్చే ఆవులు తిరిగివచ్చాయి
ఇంకేం పనిలేదు
అనుకుంటూ,
సుగంధం చనుకట్టుపై పులుముకున్న భార్యను కౌగిలించుకుని
అలుపును పోగొట్టుకుని
ఆ నిశాగ్రామణి సుఖంగా నిద్రపోతున్నాడు.
~
గ్రామంలోని ఆడవాళ్లు యోగేశ్వరుడికి నచ్చిన మరొక వస్తువు. విరహిణి మీదా, స్వైరిణి మీదా యోగేశ్వరుడు చెరో శ్లోకం వ్రాసాడు కానీ, శారీరక వర్ణనల మీద ఈ కవి మనస్సు పోలేదు. ఆడవాళ్ల అందం ఈయనకు ఎలా కనబడిందో చూడండి -

విలాస-మసృణోల్లసన్ముసల-లోల-దోః కందలీ-

పరస్పర-పరిస్ఖలద్-వలయ-నిఃస్వనోద్బంధురాః
లసంతి కల-హుంకృతి-ప్రసభ-కంపితోరః-స్థల-
త్రుటద్-గమక-సంకులాః కలమ-కండనీ-గీతయః॥
(సదుక్తి 1063 ,పృథ్వి)

విలాసంగా నున్నదనపు రోకళ్లతోపాటుగా చలిస్తూన్న మొగ్గలవంటి చేతులమీద ఒకదానితోపాటు మరొకటిగా పైకీ క్రిందకీ జారుతున్న గాజుల సవ్వడులతో, సొగసుగా 'హుం' అని శబ్దం బైటికి రావడం చేత ఆయాసంలో బలవంతంగా కంపించిన వక్షఃస్థలంవల్ల జారిపోయిన గమకాలతో ఉన్న ఊకదంపు పాటలు సొంపులీనుతున్నాయి.

ఆడవాళ్లు రోకళ్లలో దంచుతున్నారు. పని తెలీయకుండా పాటలు పాడుకుంటున్నారు. ఆ సన్నివేశం అనుకోనివిధంగా మారి, కొత్త సంగీతాన్ని పుట్టిస్తోందట. అక్కడ పుడుతున్న శబ్దాలివి - వలయ నిస్స్వనం - గాజుల శబ్దం. ఇది వారి క్రియానుగుణంగా కలుగుతోంది.

కల 'హుం'కృతి - ఇది కావాలని చేసే శబ్దం కాదు. రోకలి పోటుతో పాటుగా తనంత తానుగానే నిశ్వాసంలోంచి ఊతంగా పుట్టే సొగసైన ధ్వని. ఆ శబ్దంతో స్త్రీల ఉరఃస్థలం కంపిస్తున్నదట. ఆ ఆయాసంవల్ల వాళ్ల పాటలలోని గమకాలు జారిపోతున్నాయట! మూడవది, గమకాలు తప్పిన అసలైన పాట. ఈ మూడూ కలిసి కొత్త సంగీతం పుడుతోందనమాట.

కలమమంటే వరిధాన్యం. కండిని అంటే రోలు. ఊకదంపు పాటలకి సొగసైన పేరు సంస్కృతంలో కలమకండినీ గీతాలని. ధాన్యాన్ని దంచుతూ పాటలుపాడే స్త్రీలమీద ఇటువంటి కవితని చెప్పింది బహుశా ఈ కవే. మొదటి రెండు పాదాలూ, రెండు పదాలు తప్పించి మూడు నాలుగు పాదాలూ ఏకసమాసాలు. మంచి బిగువు.

ఒక రైతు ఇంటిని చూడండి -

ఇదానీమర్ఘన్తి ప్రథమ-కలమచ్ఛేదముదితా
నవీనాంధ స్థాలీ-పరిమలముచో హాలికగృహాః ।
ఉదంచత్- దోర్లీలా-రణిత-వలయాభిర్యువతిభిః
గృహీత-ప్రోత్క్షిప్త-భ్రమిత-మసృణోద్గీర్ణ-ముసలాః
(సదుక్తి 1337, శిఖరిణి)

ఈ కవిత వ్రాసిన సమయం ఆ ఏడు పంట చేతికొచ్చే సమయంలో. అంటున్నాడు - ఇప్పుడు రైతుల ఇళ్లకు ఒక శోభ వచ్చింది. ఆ హాలికగృహాలు మొదటి పంటకోత సంగతిచేత ఆనందిస్తున్నాయి (ప్రథమ కలమ చ్ఛేద ముదితాః). కొత్త అన్నపు కంచాల నుండి పరిమళాలను వెదజల్లుతున్నాయట ఆ ఇళ్లు. అంధమంటే ఇక్కడ చీకటికో గ్రుడ్డితనానికో చెందిన పదం కాదు. అంధమంటే అన్నము. అన్నానికున్న ఆ పరిమళాన్ని పట్టుకున్న ఈ కవిమనస్సు ఎంత విలువైనది!

ఆ రైతుల ఇళ్లల్లో యువతులెలా ఉన్నారు? చెబుతున్నాడు - వాళ్లు తమ రెండు చేతులతో రోకళ్లను దంచడం కోసం ఎత్తుతూంటే, వాళ్ల గాజులు గలగలలాడుతున్నాయట. ఆ రోకళ్లను వాళ్లు తీసుకుంటూ(గృహీత) , పైకి ఎత్తుతూ (ప్రోత్క్షిప్త), త్రిప్పుతూ (భ్రమిత), నున్నగా బైటకు వదిలేస్తూ (మసృణోద్గీర్ణ) సంబాళిస్తున్నారట!
ఇపుడు ఒక రైతు గర్వాన్ని చూడండి -

భద్రం తే సదృశం యదధ్వగశతైః కీర్తిస్తవోద్గీయతే
స్థానే రూపమనుత్తమం సుకృతినా దానేన కర్ణో జితః ।
ఇత్యాలోక్య చిరం దృశా కృపణయా దూరాగతేన స్తుతః
పాన్థైనైకపలాలముష్టిరుచినా గర్వాయతే హాలికః
(సదుక్తి 1338, శార్దూలవిక్రీడితం)

"అయ్యా, నీకు జయమవుగాక
ఈ తావులో వెళ్లే వందల మంది పాంథులందరూ నీ కీర్తిని గురించి గొంతెత్తి పాడతారు
నీ రూపుకు సాటి లేదు

నువ్వు దానంచేత కర్ణుడిని ఎప్పుడో జయించావు”
అంటూ ఒక గుప్పెడు ఎండుగడ్డికోసం తనను స్తోత్రం చేస్తున్న ఒక పిసినిగొట్టు బాటసారిని చూసి, రైతు ఉప్పొంగాడు.

~

యోగేశ్వరుడి కవిత్వం ఆ నాటి గ్రామీణభారతాన్ని మనందరికీ చూపించడానికి ఉన్న ఏకైక మార్గం. గంగను నేలమీదకు తీసుకురావడానికి భగీరథుడి వంశంలో కొన్ని తరాల అవసరం పడితే, వేదం నుండి పురాణానికీ, పురాణం నుండి కావ్యానికీ, అక్కడ నుండి నగరాలకూ రాజులకూ తీసుకురాబడిన గీర్వాణగంగను ఈ కవిభగీరథుడైన యోగేశ్వరుడు పల్లెకు తీసుకుని వచ్చాడు.

యోగేశ్వరుడు చిరుతపై చెప్పిన శ్లోకంతో నేను మొదలుపెట్టిన ఈ వ్యాసాన్ని ఆయన కుక్కపైన చెప్పిన శ్లోకంతో ముగిస్తాను -

ఆకుబ్జీకృత-పృష్ఠమున్నతవలద్వక్త్రాగ్రపుచ్ఛం భయాద్
అన్తర్వేశ్మ-నివేశితైక-నయనం నిష్కమ్ప-కర్ణద్వయం
లాలాకీర్ణ-విదీర్ణ-సృక్క-వికచద్దంష్ట్రాకరాలాననః
శ్వా నిశ్వాసనిరోధపీవరగలో మార్జారమాస్కన్దతి.
(సదుక్తి 2018, శార్దూలవిక్రీడితం)

పైకి ఎత్తిన వెనుకభాగం కలిగినటువంటి
గుర్రుమంటూనే భయంతో తనతోక పైకెత్తినటువంటి
ఇంటిలోపలికి ఎలా వెళ్లాలా అన్న దృష్టి కలిగినటువంటీ
నిక్కబొడిచిన చెవులు కలిగినటువంటి ఒక మార్జారాన్ని -
లాలాజలంపు నోటితో,
కోరలతో ఉన్న భయంకరమైన ముఖంతో
ఊపిరిబిగబట్టడం చేత ఉబ్బిన గొంతుతో ఉన్న కుక్క
ఆక్రమించింది.

~

ఆకుబ్జీకృతపృష్ఠము, లాలాకీర్ణ-విదీర్ణ-సృక్క-వికచత్-దంష్ట్రా-కరాళాననము, నిశ్వాస-నిరోధ-పీవర-గళము - ఇటువంటి పదబంధాల సొగసు, ఎవరు ఎత్తుకోని వస్తువులను గానం చేసిన సొగసు, గ్రామీణత్వపు సొగసు, సంస్కృతభాష సొగసు - ఇన్ని సొగసుల కలయిక యోగేశ్వరుడు. మన జాతి సంపద. మనం నెత్తిమీదకెత్తుకోవాల్సిన హృదయాళువు.

*

5

యోగేశ్వరుడు: ఆర్తవకవిత్వం - 2

పల్లెలంటే ఈ కవి ప్రాణం పెడతాడని ప్రారంభంలోనే మీకు మనవి చేసాను కదా. పల్లె పైన ప్రేమ తానొక్కటిగా రాదు. ప్రకృతిని తనతో పాటుగా తీసుకునే వస్తుంది. దాని ప్రభావం చేతనే ఆర్తవచక్రంలో విలాసంగా పరిభ్రమించే ప్రకృతిభామిని పై ఈ మహాకవి మనసు పారేసుకున్నాడు. యోగేశ్వరుడి కావ్యసరస్వతి మన మనసులపై ప్రసరింపచేసే వేరొక కాంతిరేఖ ఈ కవిత్వం. ఋతువు, గ్రామమూ అన్న ఈ రెండూ వస్తువులనూ సమానంగా కలిపి మెదిపిన మూర్తి యోగేశ్వరుడిది. హృదయమేమో శివాధీనం.

ఈ కవి వతంసుడు వివరించిన వాసంతవాసరాలివిగో-

ఏతే సంప్రతి వైమనస్యమనిశం నిశ్శంకమాతన్వతే
కాంతార-స్థలపద్మినీ-పరిమలైరానందితేందిందిరాః।
ఉన్మీలత్సహకార-కాననతటీ-వాచాలపుంస్కోకిల
ధ్వానాకర్ణన-కాందిశీకపథికావస్కందినో వాసరాః॥
(సదుక్తి 1238, శార్దూలవిక్రీడితం)

ఈ వాసంతవాసరాలు,

పేరడవుల్లోని మెట్టతామరల సరోవరాలలోని పరిమళాలతో
ఆనందిస్తున్న తుమ్మెదలను కలిగినవై;
విరగబూసిన తియ్యమామిడి తోటలలో
వాచాలుడై కూస్తున్న పుంస్కోకిల కుహూనాదాన్ని ఆకర్ణిస్తున్న
కాందిశీక పథికుల చేత నిండిపోతూ,
మనకు పరధ్యానాన్ని కలిగిస్తున్నాయి.

~

ఉన్నపట్టున తమను ఉండనివ్వకుండా మహాకవులను తమవైపుకు తిప్పుకున్న అజరామరమైన ఈ ఋతుచరిత్ర మనకు తెలియనిది కాదు. వసంతకాంత ఆహ్లాదమయి. వసంతర్తువులోని రోజులు మనోహరంగా ఉన్నవనో, కొత్త రంగును మోసుకొస్తున్నాయనో వర్ణించడంలో వైలక్షణ్యం లేదు. మనసును తమవైపుకు త్రిప్పుకుంటున్నాయంటూ వర్ణించి ఈ శ్లోకం సుశ్లోకమైంది.

అద్య (నేడు) లాగానే, ఈ కవితలో ఏతే (ఈ), *సంప్రతి* (ఇప్పుడు) అన్న పదాలు ప్రత్యక్షంగా ఆనాటి వాసంతవాసరాల చవిజూస్తున్న యోగేశ్వరుడు మనకోసం ఉంచిన తన ఆనవాళ్లు.

గ్రీష్మము
సదుక్తి 1258
శార్దూలవిక్రీడితం

ప్రాంతే పంకిని పల్వలస్య విలుఠన్ పోత్రీ నియత్యాతపాన్
తృష్ణాఘర్ణిభృతం ప్రదేషు మహిషః శైవాలమన్విష్యతి
ఆచీర్ణౌషధి మూల శీత సురభిశ్వాసానిలాన్ దోలయన్
ప్రక్షీణోష్మణి లీయతే వనగిరిశ్వభ్రోదరే శల్లకః

జలాశయాల ఒడ్డున ఉన్న బురదగుంటలో దొర్లుతూ
పంది ఎండబాధను పోగొట్టుకుంటోంది.
హ్రదాలలో దాక్కున్న గేదె, తృష్ణాళువై నీటి పాచిని వెతుక్కుంటోంది;
కందమూలాలను ఆరగించి, ఆ వాసనతో శీతసురభిళమైన శ్వాసవాయువులను ఒలలాడిస్తూ
క్షీణించిన వేడిమిలో ఒక ముళ్లపంది ఆ వనగిరి కలుగుల్లో లీనమైపోయింది.

ప్రకృతితో మమైకమైపోయిన ఈ కవికి సమానహృదయంతో అదే ప్రకృతితో లీనమైపోయిన ఈ జంతువులే ఆప్తులు. ఇంతకన్నా కవిత్వానికి అర్హమైన వస్తువుంటుందా? బురదగుంటలో చల్లదనం కోసం పొర్లాడే పందినీ, మడుగులలో పాచిని వెతుక్కుంటూన్న మహిషాన్నీ, సుబ్బరంగా కందమూలాలను ఆరగించి, ఆ వాసనతో శీతసురభిళంగా నిట్టూరుస్తూ పర్వతబిలాలల్లో లీనమైనపోయిన ముళ్లపందినీ గమనించి, వాటిని భావించి, వాటితో పాటుగా తానూ ధ్యానంలోకి వెళ్లి సమాధిని అనుభవించిన ఇటువంటి కవి మళ్లీ పుడతాడో లేడో.

కావ్యకర్మణి కవేః సమాధిః పరం వ్యాప్రియతే అని అలంకారికులంటారు. కావ్యాన్ని నిర్మించేటపుడు కవి పొందిన సమాధి మాత్రమే అక్కడ పని చేస్తుంది. మెక్కబడింది అని చెప్పడానికి ఆచీర్ణము అనే పదం. చాలా మంచి మాట.

శరదారంభము
సదుక్తి 1310
శిఖరిణి

పరావృత్తాః హంసాః సపది విగతం కల్మషమపాం
ప్రసన్నః శీతాంశుః ప్రసృతపటవః సూర్యకిరణాః।
దిశో దీర్ఘీభూతా గగనమసివర్ణం చ విపులం
నియంతా వింధ్యాద్రేర్వ్యదిత ముదితోసా మునివృషా॥

పొర్లాడే హంసలూ,
వెనువెంటనే అమలినాలై తేటపడే సరస్సులూ,
ప్రసన్నత వహించే శీతాంశువూ,
ఒడలు విరుచుకుంటున్న భానుకిరణాలూ,
నిడుద అయిన దిక్కులూ,
విపులమై తళతళమనే ఖడ్గవర్ణంతో మెరిసే గగనమూ -

వింధ్యాద్రి నియంత అయిన అగస్త్యుడు ఈ వేళలో ఆనందపడుతూ ఉంటాడు!

~

శ్రీగిరి సానువులలో మల్లన్న తిరుగాడుతున్నట్లుగా, తన్మయపడిన తన మనస్తనువులతో, ఒక దేవతవలే వింధ్యాచలశ్రేణులలో నడయాడాడీ కవి. అక్కడ గ్రీష్మర్తువు తన శరీరాన్ని మెల్లిగా కుంచించుకుంటూ, శరన్నలినాక్షికి మెత్తగా చోటిస్తూ ఉన్న నిగూఢసమయాన్ని, ఆ ఆర్తవసంధిని మన కళ్లముందు శాశ్వతంగా నిలిపాడు.

అగస్త్యుడి ప్రసక్తిని ఈ కవితలో తీసుకునిరావడం ఈ కవితకు ఒక నవ్యపరిమళాన్ని అలదింది. అహంకరించి, శరీరాన్ని పెంచి పరిసరప్రకృతిని ఇక్కట్ల పాలు చేసిన వింధ్యపర్వతాన్ని నియంత్రించి, తాను మరలి వచ్చేవరకూ వినమ్రంగా ఉండమని చెప్పిన మహనీయుడైన మహర్షి అగస్త్యుడు. విధినియతమైన సహజజీవనన్యాయానికి అడ్డుకట్ట ఆ పర్వతరాజును చూసిన ఆయనకు ఒకింత రోత కలిగే ఉంటుంది. ఆయన కనుక ఋతుప్రభావంలో నిలువెల్లా పులకరిస్తున్న ఈ సానుమంతుడిని గనుక చూస్తే, తప్పకుండా ఆనందభరితుడౌతాడని కవి భావిస్తున్నాడు. అగస్త్యుడిని ఈ కవి *వింధ్యాద్రేః నియంతా (*వింధ్యపర్వతపు నియంత) అనీ, *మునివృషా (*మునులలో శ్రేష్ఠుడు*)* అనీ పిలిచాడు. నూత్నపదకల్పన.

ఒక మహాతపస్వి మనసునుప్పొంగించే సంగతులేవో, మరొక సమానహృదయుడైన కవన తపస్వి మాత్రమే చెప్పగలడు.

శరత్తు
సురకో 291
ఆర్య

తృణరాజ పాక సౌరభసుగంధయః పరిణతాశవో దివసాః
ఆద్యకులోపనిమంత్రణ సుహిత ద్విజ దుఃసహోష్మాణః॥

పండిన తృణరాజపు సౌరభసుగంధాలు కలిగినవీ,
పరిణతాశువులు కలవీ,
ఆద్యకులాల ఆహ్వానం మన్నించి తృప్తిపడిన
ద్విజుల చేత ఓర్వలేని వేడిమి కలవీ
అయినవీ శరదృతు దినాలు.

~

శరత్తులో పక్వమైన తృణరాజులు గాలులకు ఒక తీపిని అద్దాయట. తృణరాజపాకమన్నాడు కవి. తృణరాజ (పుం) అన్న శబ్దానికి అమరకోశం ప్రకారం తాడిచెట్టని అర్థం. తాటిపళ్ల తీపి రుచిని తమలో కలగలుపుకొని మోసుకొనివచ్చే గాలులున్న వాతావరణమది. దానితో పాటు, పరిణతాశువులు కలవట ఆ రోజులు. పరిణతాశువులంటే పరిణతి చెందిన ఆశువులని. *పాటలే వ్రీహౌ* (ఎర్రవడ్లు) అని వాచస్పత్యనిఘంటువు ఆశుశబ్దానికి ఇచ్చిన ఒక నిర్వచనం. ఎర్రవడ్లు పరిణతి చెందే కాలమది.

ఇక ఆనాటి బ్రాహ్మణులను వర్ణిస్తున్నాడు కవి. వారు ఆద్యకులాలవారు ఆహ్వానించగా వెళ్లి, తృప్తులై వేడిమిబారిన పడతారట! *తుష్యంతి భోజనే విప్రాః* అని కదా! ఇక ఆద్యకులమన్న పదానికి అర్థం

ఏమిటి అని. ఆద్యమంటే ప్రధానమని ఒక అర్థం. ప్రధానకులాలవారు అని ఒక అర్థం చెప్పుకోవచ్చు. లేదా, *అద్యతే యత్ తత్ ఆద్యమ్* అని శబ్దకల్పద్రుమం. ఏది తినబడుతుందో అది. తినబడేది ధాన్యమే కనుక, ఆద్యమంటే ధాన్యము. అంటే, పంట చేతికి వచ్చి, ధాన్యమిబ్బడి ముబ్బడిగా ఉన్న ప్రధాన కులాల వారు గౌరవభావంతో బ్రాహ్మణులను ఇంటికి భోజనానికాహ్వానిస్తే, అక్కడ తృప్తి పడేవరకూ తిని, సరిగా అరగని కాలం కావడం చేత శరీరంలో ఉష్ణప్రకోపాన్ని పొందేవారన్నమాట ఆ నాటి ద్విజులు.

ఉపనిమంత్రణమంటే ఆహ్వానం. సుహితుడంటే తృప్తుడు. ఊష్మమంటే వేడిమి.

శిశిరము
సదుక్తి 1350
శార్దూలవిక్రీడితం

పాకక్షామతిలాః సముత్సుకయితుం శక్తాః కపోతాన్భువః
శ్యామత్వం ఫలపీడ్యమానకుసుమానాపద్యతే సర్షపాన్।
వాయుర్వ్యస్తశణస్తుషారకణవానభ్యేతి కంపప్రదః
పాంథైః శుష్కవివాదబద్ధకలహైః పుణ్యాగ్నిరాసేవ్యతే॥

పావురాళ్లను భూమినుండి తమవైపు లాగుకునే
శక్తిమంతాలైన పండి, ఎండిన నువ్వుగింజలు;
తన పూతను పీడిస్తున్న ఆవాల పంటకు అబ్బిన శ్యామత్వమూ;
రెల్లును చెరచి, తుషార కణాలను నింపుకొని
వణికిస్తూ ఎదురుగా వస్తున్న వాయువూ;
శుష్కవివాదకలహాలలో మునిగితేలుతున్న
పాంథులతో సేవింపబడుతున్న పుణ్యాగ్ని —

ఇది ఆ నాటి శిశిరర్తుస్వరూపం.

~

సర్షపాలంటే ఆవాలు. ఆ పంట స్థితిగతులను ఇంతందంగా వర్ణించాడంటే, ఈ కవి ఆ క్షేత్రంలో చలికి వణుకుతూనే నడిచి ఉంటాడు. అంతచలిలోనూ పావురాళ్లను ఆకర్షిస్తున్న ఎండిన నువ్వుగింజలను చూసాడు. తనకు ఎదురవుతున్న వణికించే వాయువు కాఠిన్యానికి లోనైయాడు. నిరుపయోగాలైన వాదాలకు దిగి గొడవలు పడుతున్న పాంథుల మనస్సులకు చలిని పోగొట్టడమనే మిషనడ్డం పెట్టుకుని ఒక పుణ్యాగ్ని ఉష్ణసేతువులా వారధి నిర్మించడం చూసాడు. బెంగాలులో ఆవపంటను అక్టోబరు నవంబరు నెలల్లో వేస్తారట. అది ఫిబ్రవరి-మార్చి సమయానికి పక్వానికి వస్తుందట. పచ్చని రంగులో ఎదిగే ఈ పంట ఆవపూలు రాలిపోయే కొద్దీరంగులు మారి కపిలవర్ణరంజితమై సొగసులు పోతుందట.

శిశిరము : 2
సురకో 318
స్రగ్ధర

వారం వారం తుషారానిలతులిత పలాలోష్మణాం పామరాణాం
దండవ్యాఘట్టనాభిః క్రమపిహితరుచౌ బోధ్యమానే కృశానౌ।
ఉద్ధూమైర్భీజకోషోచ్చటన పటు రవైః సర్షపక్షోదకూటైః
కోణే కోణే ఖలానాం పరిసరసకటుః కీర్యతే కోపి గంధః॥

పామరులు రగుల్చుకున్న మోడులలో
మాటిమాటికీ సమవుజ్జీలైన శీతవాయువులు తాకి
వేడిమిని కోల్పోతూ మళ్లీ అంటుకుంటూ,
క్రమంగా నివురుగప్పిన తన రుచిని కృశానువు బోధిస్తుండగా;
చప్పుళ్లతో పగులుతున్న ఆవకంకుల నుండి పైకి లేస్తున్న ధూమంతో కూడుకుని
అనిర్వచనీయమైన ఘాటువాసన ఒకటి గాదెల కోణకోణాలను ఆక్రమిస్తోంది.

~

ఈ కవితలోనూ ఆవాల పంట వర్ణనే. ఆవపంట బహుప్రయోజనకారి . ఆవ ఆకులూ, గింజలూ ఆరోగ్యదాలైన వస్తువులు కాగా, ఆవపూలు తేనెటీగలను అమితంగా అకర్షించే మరందశక్తి. ముందుగా వచ్చిన పూత ఆవకంకులుగా పరిణామం చెందుతుంది. హరితవర్ణంలో ఏర్పడిన ఆ కంకులు క్రమేణా పింగళవర్ణంలోకి మారుతాయి. అపుడు ఆవగింజలను గ్రహిస్తారు. వాటిని గ్రహించేటపుడో లేదా ఏ గాలికో కంకులలోనుండి గింజలు రాలిపోవడమూ, ఎగిరి చుట్టూతాపడి, ఆవమొక్కలు మొలవడమూ సర్వసాధారణం.
ఈ కవి శిశిరర్తువులో ఆ చిటపటమని కంకులు పగులుతున్న శబ్దం వింటూ ఆ ఆవవాసనను మనసారా పీల్చుకున్నాడు. సరస్వదేవిని తన గుండెలోకి రమ్మని పిల్చుకున్నాడు. జవమారా కవితలతో కొల్చుకున్నాడు. మనకీ కావ్యసంపద చేతికివచ్చింది. అయ్యో, ఈ కవిని నా భుజాలపైకెత్తుకుని మోసే అదృష్టం నాకు లేకుండా పోయింది కదా!

ఈ సంస్కృతభాష రంగూ రుచీ వేరు. పలాలోష్మమంటే, మోదుల యొక్క నిప్పు. సర్షపక్షోదకూటము అంటే, పగులుతున్న ఆవకంకుల ప్రోవులు. ఖలశబ్దానికి ధాన్యాగారమని అర్థం.

*

6

యోగేశ్వరుడు: కాంతారదుర్గ

సురకో1191

స్రగ్ధర

శ్లో.

త్రైస్త్రైర్జీవోపహారైరిహ కుహరశిలాసంశ్రయామర్చయిత్వా
దేవీం కాంతారదుర్గాం రుధిరముపతరు క్షేత్రపాలాయ దత్వా।
తుంబీవీణావినోదవ్యవహిత సరకామహ్ని జీర్ణే పురాణీం
హాలాం మాలూరకోషైర్వ్యవతి సహచరా బర్బరా శీలయంతి॥

గుహలో శిలాప్రతిష్ఠాపిత యైన
దేవి కాంతార దుర్గను
జీవబలులతో సంతుష్టపరచి, అర్చించి,
వృక్షమూలంలో కొలువై ఉన్న
క్షేత్రపాలునికి రుధిరాన్ని అర్పించి;
తమ యువతులతో కలిసి – ఆ శబర జానపదులంతా
తుంబీవీణను పలికిస్తూ,
తాము వేసుకున్న మంటలు ఆరిపోతూ ఉండగా
ఆరాత్రమూ గానవినోదాలలో తేలియాడుతూ,
పురాతన మద్యాన్ని
మారేడు పాత్రలలో నుండి తీసుకొని సేవిస్తున్నారు.

~

తొమ్మిదవ శతాబ్దంలో కానలలో చెట్టుతోనూ పుట్టతోనూ మమేకమై జీవించిన జానపదుడి జీవనశైలికి నిలువుటద్దం ఈ కవిత. ఈ దేశంలో భగవంతుడు వేదాలలోనో దేవాలయాలలోనో మాత్రమే లేడు. భక్తికి బానిసై, గ్రామసీలమలో పంటపొలాల దగ్గరి ఉపతరువేదికలపై ఆటవికులు నిలిపిన శిలలో వచ్చి కూర్చున్నాడు. పద్దెనిమిది శక్తిపీఠాలలో ఏ పరాశక్తి దుర్గాదేవి ప్రజాళిని రక్షిస్తూ కొలువై ఉందో, ఆవిడే అడవిని రక్షించడం కోసం, ఆ ప్రకృతి తానే అని మనకు చెప్పడం కోసం వనదుర్గగా ప్రకాశించింది. ఆవిడను యోగేశ్వరుడు కాంతారదుర్గ అన్నాడు. కాంతారమన్నా వనమన్నా అడవి అని అర్థం.

కాననసీమలకు రక్ష వనదుర్గ. వనదుర్గామంత్రాన్ని ఇప్పటికీ అనేకులు చేస్తుంటారు. చిత్రకూటప్రాంతంలో వనదుర్గాశక్తిపీఠం ఉన్నది. క్రూరజంతుభయరక్షణకోసం, వాంఛితలాభంకోసం ఈ తల్లిని ఉపాసిస్తారు. నవదుర్గలలో వనదుర్గ మొదటిది.

ప్రథమా వనదుర్గేతి ద్వితీయా శూలినీ మతా
తృతీయా జాతవేదా చ చతుర్థీ శాంతిరిష్యతి

పంచమీ శబరీ చైవ షష్ఠీ జ్వాలేతి గీయతే
సప్తమీ లవణా చేతి అష్టాభ్యామాసురీ మతా
నవమీ దీపదుర్గేతి నవదుర్గాః ప్రకీర్తితాః.

అని. ధనుర్బాణాది ఆయుధాలు ధరించి, త్రినేత్రయై, శత్రుసంహారం చేస్తున్నట్లుండే ఈ శక్తి కొన్ని వేల ఏళ్లనుండీ అడవులనూ, ఆటవికులనూ ఒక కుహరంలో కొలువై, కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్న భక్తవత్సల.

క్షేత్రపాలుడు ఋగ్వేదకాలంనాటి దేవత. "*క్షేత్రస్య పతినా వయగ్ం హితేనేవ జయామసి, గామశ్వం పోష యిత్న్వాసనో మృళాతీదృశే*" అంటూ ఋగ్వేదర్షి పంటపొలాల అధిదేవతను కీర్తిస్తూ ఆ దేవత అనుగ్రహాన్ని కోరుకొన్నాడు. (క్షేత్రపతి సూక్తం: ఋగ్వేదం, 4 వ మండలం, 57 వ సూక్తం) ఈ విన్నపాలను ఆలకించి, తన చోటులో ఉండలేక ఆ క్షేత్రపతి దివ్యజీవలోకాలనుండి భారతీయక్షేత్రాలలోకి ఆవేశించాడు. ఎంతటి దయామయుడు కాకపోతే, ఆ దేవుడు ఇప్పటికీ నేలను నమ్ముకున్న ప్రతీవాడికీ పాడి పంటలను కలిగిస్తూనే ఉంటాడు! ఈ సద్యఃప్రసాద గుణమే క్షేత్రపతిని జానపదుల ముంగిళ్లవరకూ లాగుకొని వచ్చింది. జానపదుల మనస్సులలో ఈ దేవునిపై ఉన్న అనురక్తిని మార్కండేయుడు ఇలా చెబుతున్నాడు -

స ఏవ గ్రామపాలోఽభూత్ పశుపాలః స ఏవ చ
క్షేత్రపాలః స ఏవాసీత్ ద్విజాతీనాం చ రక్షితా

(మార్కండేయ పురాణము 19.24)

(అతడే గ్రామాలను రక్షించే గ్రామపాలుడు, పశువులను రక్షించే పశుపాలుడూ కూడా అతడే. బ్రాహ్మణులను రక్షించే క్షేత్రపాలుడూ అతడే.)

అగ్నిపురాణం క్షేత్రపాలుడి ఉపాసనాపద్ధతులను వివరించింది. గ్రామాన్ని రక్షించడం కోసం దేవాలయంలో ఆగ్నేయమూలగా శూలపాణియై త్రినేత్రుడైన క్షేత్రపాల మూర్తిని ప్రతిష్ఠించాలట. భైరవభేదమైన ద్వారపాలకుడికి కూడా క్షేత్రపాలుడని పేరు. ఈ మూర్తిలో సాత్త్విక, రాజస, తామసిక ఆవేశాలు ఉన్నాయట. ఈ మూర్తి రెండు చేతులతోనూ, నాలుగు చేతులతోనూ, ఎనిమిది

చేతులతోనూ ఉండడం ఉంది. తాంత్రికప్రపంచంలో ఈ దేవత ప్రాముఖ్యతను సంతరించుకున్నా, వైదికబాంధవ్యం తెగకపోవడం ఈ దేవత ప్రత్యేకత.

తాంత్రికసంప్రదాయంలో ఈ దేవత విస్తృతి చెందిన వైనాన్ని శబ్దకల్పద్రుమం చెప్పింది. ఉపాసనలో క్షేత్రపాలుడు మాతృకాబీజభేదంతోనూ, నామభేదంతోనూ 49 రకాలుగా ప్రకాశిస్తున్నాడు. వారి పేర్లివి - అజుడు, ఆపకుంభుడు, ఇంద్రస్తుతి, ఈడాచారుడు, ఉక్తసంజ్ఞుడు, ఊష్మాదుడు, ఋషిసూదనుడు, ఋముక్తుడు, లుప్తకేశుడు, ౡపకుడు, ఏకదంష్ట్రుడు, ఐరావతుడు, ఓషబంధుడు, ఓషధీశుడు, అంజనుడు, అస్త్రవారుడు, కవలుడు, ఖరుఖానలుడు, గాముఖ్యుడు, ఘంటాదోజ్మానుడు, చండవారణుడు, ఘుటాటోపుడు, జటాలుడు, ఝుఝ్జీవుడు, ఞడశ్చరుడు ఇత్యాది.

క్షేత్రపాలుడు క్షేత్రరక్షకుడు. ఈ పేర్లతోనే క్షేత్రపాలుడి తత్త్వం గోచరమౌతోంది. "ఇంద్రస్తుతి" అన్న పేరు ఈ దేవతకూ ఇంద్రుడికీ ఉన్న సంబంధాన్ని ప్రకటిస్తుండగా, ఓషబంధుడు, ఓషధీశుడు ఇత్యాది పేర్లు భూమికీ ప్రకృతికీ ఈ దేవత ఎంత దగ్గరో తేటతెల్లం చేస్తున్నాయి. క్షేత్రపాలుడు జీవబలిప్రియుడు. ఆ బిలిని కూడా ఊరగాయ, పెద్ద పిండాలతో కలిపి నైవేద్యమివ్వాలట (*బలిమపి సోపదంశబృహత్పిండేన దద్యాత్).* బలితో సంతుష్టి చెందిన క్షేత్రపాలుడు కాంతినీ, మేధనూ, బలాన్నీ,ఆరోగ్యాన్నీ, తేజస్సునూ పుష్టినీ యశస్సునూ, సంపదలనూ ఇస్తాడని తంత్రసారంలో వ్రాయబడి ఉంది.

పంచతంత్రంలో మూడవభాగంలో కాకోల్లూకీయమనే కథలో హరిదత్తుడనే బ్రాహ్మణరైతు తనపొలంలో కనబడిన ఒక సర్పాన్ని క్షేత్రపాలుడని భావిస్తాడు. జైన సంప్రదాయంలో కూడా క్షేత్రపాలోపాసన ఉన్నది. ఆ దేవత ఈ మహాకవి మూలాన ఈ విధంగా మన కళ్లముందుకు వచ్చింది.

దేవతోపాసన రోజున రాత్రి ఆ బర్బరుల వేడుకను వర్ణించిన ఈ శ్లోకం, యోగేశ్వరుడు మన చెవిలో చెప్పిన ఆనాటి ప్రజాజీవనవిధానరహస్యం. *సరక* శబ్దానికి ఇక్షుశీధువనీ, మద్యపాతపాత్ర అనీ

అర్థాలు. వారియొక్క మద్యపానంలో మాలూరకోషాల ప్రసక్తి ఉంది. మాలూరమంటే మారేడు. మారేడు పళ్లతో మద్యాన్ని తయారు చేసే విధానం ఉంది. (చూ. Bio - processing of bael fruits into wine with antioxidants by S.K Panda, U.C. Sahu, S.K. Behera and R.C. Ray). దానిని వారు తమ మద్యసేవనంలో వినియోగించుకున్నారంటే ఈ మర్మం వారికానాడే తెలుసు. ప్రకృతిలో ఆపాదచూడమూ మునిగి జీవించే అడివి పుత్రులకు బ్రతుకుపాఠాలు నేర్పగలిగిన దమ్మెవరికుంది గనుక?!

*

7

అవశిష్టానువాదాలు

ప్రత్యూషము

సదుక్తి 1182

స్రగ్ధర

అదిగో, చూడు!
కాలగతికి లోబడి
తన ప్రియుడు కళాపతీ అయిన చంద్రుడు
క్రమంగా అస్తమిస్తూండగా
పక్షికూజనాల ద్వారా విలపిస్తున్నదై,
వీడిపోతున్న చీకట్లనే జడకొప్పులు కలిగి,
జారిపోతున్న ముత్యాలకు పోటీ ఇవ్వగలిగే విధంగా
తారకలనే అశ్రుబిందువులను రాల్చుతూ
రాత్రినాయిక
అప్పుడే వికసిస్తున్న ప్రత్యూషసంధ్య అనే అగ్నిలో
దేహత్యాగం చేస్తున్నది.

శ్లో.

పత్యౌ పాత్రే కలానాం వ్రజతి గతివశాదస్తమిందౌ క్రమేణ

క్రందంతీ పత్రిరావైర్విగలిత తిమిరస్తోమ ధమ్మిల్లభారా।

ప్రభ్రంశి స్థూలముక్తాఫల నికర పరిస్ఫర్ధి తారాశ్రుబిందుః

ప్రోన్మీలత్పూర్వసంధ్యాహుతభుజి రజనీ పశ్య దేహం జుహోతి॥

చంద్రుడు

సదుక్తి 938

శిఖరిణి

ఎర్రని కాంతులను ధరించి,
ఉదయశైలాగ్రంపైన తడబడుతున్న
ఆ జాబిల్లి
ఒకవేళ మద్యం సేవించి మత్తిల్లిన కర్షకుడైతే,
అప్పుడు
తమాలవృక్షకాంతులను సైతం
హరించేదిగా ఉన్న
ఈ తమస్సు అనే అతని వస్త్రం కూడా
వదులైపోయి, జారిపోవడం ఖాయం.

శ్లో.
అసౌ బిభ్రత్తామ్రత్విషముదయశైలస్య శిరసి
స్స్ఖలన్ ప్రాలేయాంశుర్యది భవతి మత్తో హలధరః।
తదానీమేతత్తు ప్రతినవతమాలద్యుతిహరం
తమోఽపి వ్యాలోలం విగలతి తదీయం నివసనమ్॥

అసతి

సురకో 814

శిఖరిణి

ఉలుకూ పలుకూ లేదు
నృత్తగీతాలో, ఆలింగనం వంటివో కూడా లేవు
కేవలకరస్పర్శతో మొదలై
విప్పివేసిన వస్త్రంతో
పడకపైన శయనించడంతో ముగిసి
మాటిమాటికీ వణుకుతూ
ఆ మూలవైపూ ఈ మూలవైపూ చూస్తూ
ఏదో అహల్యా, ఇంద్రుడూ కూడుకున్నట్లుగా
క్షణికంగా వారి కలయిక జరిగింది.

శ్లో.

వ్యపేతవ్యాహారం గతవివిధశిల్పవ్యతికరం
కరస్పర్శారంభప్రగలిత దుకూలాంతశయనమ్।
ముహుర్బద్ధోత్కంపం దిశి దిశి ముహుఃప్రేషితదృశోః
అహల్యాసుత్రామ్ణోః క్షణికమివ తత్సంగతమభూత్॥

(గత-వివిధశిల్ప-వ్యతికరం: శిల్పాలు రెండురకాలు: నృత్తసంగీతవాద్యాది 64 బాహ్యక్రియలు,ఆలింగనాది 64 అంతరక్రియలు)

ప్రత్యూషం

సురకో 979

మాలిని

రాత్రివియోగంతో బాధపడే
జక్కవపక్షులకు ఆప్తుడైనవాడూ,
పద్మాల ముకుళనముద్రను
భగ్నం చేసేవాడూ,
ఉదయగిరి వనాలలో
బాలమందారపుష్పం లా
కోపగించుకున్న కోతి చెక్కిలివంటి ఎరుపుదనంతో
చీకట్లను చీల్చుతూ
ఈ సూర్యుడు ఉదయిస్తున్నాడు.

శ్లో.

అయముదయతి ముద్రాభంజనః పద్మినీనాం
ఉదయగిరివనాలీబాలమందారపుష్పమ్।
విరహవిధురకోకద్వంద్వబంధుర్విభిందన్
కుపిత కపి కపోలక్రోడ తామ్రస్తమాంసి॥

నిర్వేదం

సురకో 1453

ఆర్య

తన ఇంటిలో పెంచుకునే నెమళ్లపేర్లతో
అడవినెమళ్లను పిలుస్తూ
ఎంతసేపటికీ అవి దగ్గరకు రాకపోయేసరికి
తన బాలతనయుడు ఏడవడం చూసిన
నీ శత్రుకాంత
కన్నీరుమున్నీరైంది.

శ్లో.

నిజగృహమయూరనామభిరాహూతానాగతేషు వనశిఖిషు।
బాలతనయేన రుదతా త్వదరివధూ రోదితా దీర్ఘమ్॥

(వ్యా. ఈ కవితను యోగేశ్వరుడు తన మహారాజును శ్లాఘిస్తూ చెప్పి ఉండాలి. ఒక రాజును పొగిడేటపుడు ఆతని శత్రువు ఈ రాజు చేతిలో ఓడిపోతే, ఆతని భార్యపడే కష్టాలను వర్ణిస్తూ పొగడడం కవిసంప్రదాయం. ఇక్కడ యోగేశ్వరుడు చేసినదదే. శత్రురాజు కుమారుడు తన ఉద్యానవనంలో నెమళ్లను పెంచుకుంటున్నాడు. వాటికి పేర్లు కూడా పెట్టాడు. అయితే, అసలు రాజు దండెత్తి రావడంతో అననుకూలపరిస్థితిలో ఆ శత్రురాజుభార్య తన పిల్లవానితో కలిసి అడవుల పాలైంది. ఆ అడవిలో నెమళ్లున్నాయి. వాటిని తన స్వంతనెమళ్లుగా భావించి, వాటి పేర్లతో వీటిని పిలవడం మొదలుపెట్టాడు పిల్లవాడు. అవి ఎంతకూ తన వద్దకు రాకపోయేసరికి దుఃఖం తన్నుకురాగా, రోదించాడు. వాని బాధను చూసిన తల్లి మరింతగా విలపించింది. *)*

గీతం

సదుక్తి 288

స్రగ్ధర

ఒక పిక్కకు చుట్టుకొని ఉన్న దుద్దుకర్రతో,
శిరస్సుపైన ఆన్చిన భుజము కలవాడూ
సొంపులీనుతున్న ముడిచిన సిగదండతో
గోయుద్ధగీతాలను గానం చేస్తూ,
పొగరుతో పేట్రేగిన రెండు ఆబోతుల కుమ్ములాటల రసానందంతో
దీర్ఘమైన అనుబంధం కలిగినవాడూ
గోవుల రక్షణమంత్రీ ,
మురరిపువూ అయిన
క్రీడాగోపాలమూర్తి రక్షించును గాక!

శ్లో.

దేవస్త్వామేకజంఘావలయితలగుడో మూర్ధ్ని విన్యస్తబాహుః
గాయన్ గోయుద్ధగీతీరుపచితశిరః శేఖరః ప్రగ్రహేణ।
దర్పస్ఫూర్జన్మహోక్షద్వయసమరరసాబద్ధదీర్ఘానుబంధః
క్రీడాగోపాలమూర్తిర్మురరిపురవతాదాత్తగోరక్షలీలః॥

(బహుశా యోగేశ్వరుడు వ్రాసిన ఒకేఒక వైష్ణవకవిత ఇది. ఎద్దుల కుమ్ములాటతో కృష్ణవిభునికున్న దీర్ఘానుబంధాన్ని దర్శించి, గోవుల నడకలపై, నడతలపై మనసును పారేసుకున్న ఆయన్ను విరళమైన రీతిగా సాక్షాత్కరింపజేయడంలో కృతకృత్యుడయ్యాడు. స్వామి వేణుగానాన్ని విన్నటువంటీ, వర్ణించినటువంటీ కవులూ తపస్సులూ ఉన్నారేమో. స్వామి గోయుద్ధగీతాలను గానం చేస్తుంటే ఆలకించిన అదృష్టం ఈ కవితల్లజుడికే పట్టింది.)

మిశ్రకచంద్రుడు

సదుక్తి 420

శిఖరిణి

సరోవరంలోని తామరతూడుల కాంతిని ధరించి,
చుట్టూ చీకటిని మొత్తంగా గటగటలాడించి,
అడ్డూ అదుపూ లేనివై
విజృంభిస్తున్న ఈ ఇందుమయూఖాల వల్ల
రాత్రి
తనను తాను పగలనే అనుకుంటోంది.
గుడ్లగూబల గుంపు చకితచకితమై చూస్తోంది.
నిద్రాణమై ఉండవలసిన పద్మవనాలు
ఎట్లానో వికస్తిస్తున్నట్లుగానే ఉన్నాయి.

శ్లో.

అథోద్దామైరిందోః సరసబిసదండద్యుతిధరైః

మయూఖైర్విక్రాంతం సపది పరితః పీత తిమిరైః।

దినమ్మన్యా రాత్రిశ్చకితశ్చకితం కౌశికకులం

ప్రఫుల్లం నిద్రాణైః కథమపి యథాంభోరుహవనైః॥

అభిసారారంభం

సదుక్తి 778

శార్దూలవిక్రీడితం

సకియా!
సుగంధాలు పులుముకున్న నా ముఖాన్ని దాచేసాను
నూపురాల నోరు నొక్కేసాను
మొలనూలు ఘల్లులను వస్త్రంతో ఆపేసాను
పంజరంలోని గోరువంకలు కునుకు తీస్తున్నాయి
పరిజనులు నిద్రలో తూగుతున్నారు
రాజపథం నిర్జనమైంది.
చీకట్లు దట్టమైయాయి
పద, పద! బయలుదేరు!

శ్లో.

ఉత్క్షిప్తం సఖి వర్తిపూరితముఖం మూకీకృతం నూపురం
కాంచీదామ నివృత్తఘుర్ఘర రవం క్షిప్తం దుకూలాంతరే।
సుప్తాః పంజరసారికాః పరిజనోప్యాఘూర్ణితో నిద్రయా
శూన్యో రాజపథస్తమాంసి నివిడాన్యేహ్యేహి నిర్గమ్యతామ్॥

ద్యూతము

సదుక్తి 1067

శార్దూలవిక్రీడితం

జూదంలో
ఆమె ముందుగా పందెం వేసిన కౌగిలిని గెలిచి,
తరువాత ఆమె పణంగా పెట్టిన ధనం మొత్తాన్నీ గెలిచి,
"మరి ఒడ్డడానికి నీ దగ్గర ఏం మిగిలింది?"
అని ప్రియుడు అడుగుతూండగా,
లోలోపల దాగున్న చెలరేగిన శృంగారభావ చిహ్నితయై
ఆమె పాచికలు వేయడానికి
తన చెమటలో మునిగిపోయిన చేతిని చాచింది.

శ్లో.

ఆశ్లేషః ప్రథమం క్రమేణ విజితే కృత్యే ధనస్యార్పణం
కేలిద్యూతవిధౌ పణం ప్రియతమే కాంతాం పునః పృచ్ఛతి।
అంతర్గాఢవిగూఢ మన్మథరసస్ఫారీ భవద్గండయా
స్వైరం శారి విసారణాయ నిహితః స్వేదాంబుగర్భః కరః॥

గ్రామ్యనాయకుడు

సదుక్తి 981

శార్దూలవిక్రీడితం

1

మహా పిసినారి
పరసరాలలోని కడిమితీగలను చుట్టుకొని
స్వైరవిహారం చేస్తూ
అంకురించిన వెల్లుల్లి లాంటి నలుపువర్ణం కలిగి
ఆ నాయకుడు తిరుగాడుతుంటే,
రోకళ్లు విశ్రమించాయి
నీటి కుండలు శాంతించాయి
నిప్పులు ఆరిపోయాయి
ఆ పల్లెపడుచుల ఊరు తన మొఖాన్ని పక్కకు తిప్పుకుంది.

శ్లో.

స్వైరం కీకటదారకః పరిసరే గుంద్రాలతోపాహిత-
త్వంగచ్చర్చరకో విరూఢలశునశ్యామః పరిక్రామతి।
విశ్రాంతం ముషలైః స్థితం తిత ఉభిర్విశ్రబ్ధమంభోఘటై
ర్నిర్వాణం జ్వలనైర్ముఖైర్వివలితం గ్రామేయికాణాం పురః॥

గ్రామ్యనాయకుడు-2
సదుక్తి 892
ఆర్య

పెరిగెడతాడు
చెట్టెక్కుతాడు
నూతిని దూకుతాడు
బండి పైకెక్కుతాడు
తననా అంటూ పాడుతాడు – పరుడిభార్యను చూసిన కాముకుడు.

శ్లో.

ధావతి తరుమారోహతి కూపం లంఘయతి శకటముత్క్షిపతి।
తినవతి తినవతి గాయతి దృష్ట్వా పరయోషితం షింగః॥

ద్రావిడకాంత

సురకో 183

మాలిని

ద్రావిడకాంతలు
ఒక క్షణమాగి,
లోలకులలో ముడిచిన కుసుమవృంతాలను
అదేపనిగా విదుపుకుంటుంటే
చెక్కిలిపై పూసుకున్న పసుపుతో చేరి పరిమళించినటువంటీ,
తమ ప్రియుడి నఖక్షతాలలో చేరి సలుపు కలిగిస్తున్నటువంటీ
స్వేదబిందువులు ఆతపం వల్ల కలుగుతున్నాయి.

శ్లో.

ఉపనయతి కపోలే లోలకర్ణప్రవాళ

క్షణముకుళ నివేశాందోలనవ్యాపృతానామ్

పరిమలిత హరిద్రాన్ సంప్రతి ద్రావిడీనాం

నవనఖ పదతిక్తానాతపః స్వేదబిందూన్.

మహాకవిమార్గము

సురకో 1733

శార్దూలవిక్రీడితం

భవభూతి దీనినే ఉద్ధరించాడు

ప్రతీదినమూ బాణుడు ఇక్కడే తిరుగాడాడు

కమలాయుధుడు దీనినే అభ్యసించాడు

కేశటుడు చిరకాలం ఇక్కడే ఉన్నాడు

వాక్పతిరాజు పాదధూళి చేత ఇదే చిరకాలం పవిత్రీకృతమైంది.

ఈ పంథా ఉందే, ఇది,

ఏదో దైవవశంగా ఎవడికో గుణవంతుడికి మాత్రమే

గోచరమవుతోంది.

శ్లో.
ఉన్నీతో భవభూతినా ప్రతిదినం బాణే గతే యః పురా
యశ్చీర్ణః కమలాయుధేన సుచిరం యేనాగమత్కేశటః
యః శ్రీవాక్పతిరాజ పాద రజసాం సంపర్కపూతశ్చిరం
దిష్ట్యా శ్లాఘ్యగుణస్య కస్యచిదసౌ మార్గః సమున్మీలతి

******

ఇతిశివమ్